

## దీపావళి ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పటిష్ట చర్యలు చేపట్టాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ

9వ పేజీలో...

ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

వార్త

బుధవారం 23, అక్టోబర్ 2024 16 పేజీలు



# కేంద్ర ప్రయోజిత పథకాలను.. పకడ్బందీగా అమలు చేయాలి

- ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి
- పాఠశాల హెడ్ మాస్టర్‌పై విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలి
- ఆసుపత్రి నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలి
- ఖమ్మం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహణ





ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 22, ప్రభాతవార్త: జిల్లాలోని ప్రజలకు కేంద్ర ప్రాయోజిత పథకాల లబ్దిపొందేలా అధికారులు పనిచేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటి (దిశ)సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ,ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్‌లతో కలిసి నిర్వహించారు. దిశ సమావేశంలో ప్రస్తుతం వారి శాఖల పరిధిలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు, రాబోయే 3నెలల కాలంలో నిర్దేశించుకన్నలక్ష్యాలు తదితర అంశాలపై జిల్లా సంక్షేమ అధికారి, జీఎం పరిశ్రమలు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అదికారి, ఈఈ హౌసింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఖమ్మం మున్సిపల్ కమీషనర్, జాతీయ రహదారులు, విద్యుత్‌శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు నివేదికలు వివరించారు.

ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ బ్యాటరీ ఆధారిత వాహనాలను,అవసరం అర్హత ఉన్న దివ్యాంగులకు అందించేందుకు కేంద్ర అధికారులను ఫాలో ఆఫ్ చేస్తూ క్యాంపు నిర్వహణ కోసం కృషి చేయాలని, జిల్లా వ్యాప్తంగా అవసరమైన బ్యాటరీ ట్రై సైకిళ్ల నివేదిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. పరిశ్రమల ప్రోత్సహానికి తీసుకోవాల్సిన చర్యలు మొదలగు అంశాలపై గణాంకాలతో పక్కా నివేదిక తయారు చేయాలన్నారు. జిల్లాలో పత్తి పంట

2 లో..



9 లో..

# సారు రూటే సపరేటు

- ఇష్టమైతే వస్తారు...కష్టమైతే అంతే సంగతి
- ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతాడో తెలియని దుస్థితి
- రాత్రి వేళల్లో వచ్చి రిజిస్టర్లో సంతకాలు పెడుతున్నట్లు ఆరోపణలు
- నెలలో పట్టుమని పది రోజులు వచ్చిన దాఖలాలు లేవు...
- దేనిలోనైనా వాటా గుంజి జేబులో వేసుకోవాల్సిందే...
- హాజరు కాకపోయినా నెల జీతం ఫుల్‌గా తీసుకుంటున్నట్లు విమర్శలు...
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ప్రధాన ఉపాధ్యాయుని వ్యవహారం...

మధిర, ప్రభాతవార్త :



# సహకార మేనేజర్ స్వాహా పర్వం!

- రూ.5కోట్ల కుంభకోణం ఆరోపణలొచ్చినా నదురూలేదు బెదురు లేదు
- స్వాహా మేనేజర్లకు వరంగా మారిన ఎంఈజిపి

ఖమ్మం, ప్రభాతవార్త ప్రత్యేక ప్రతినిధి : ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని రూరల్ డిసిసిబిలో రూ.5కోట్ల రూపాయల కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. మొన్నటి వరకు ఇక్కడ మేనేజర్‌గా పనిచేసిన వ్యక్తిపై ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికి ఆయనలో నదురు, బెదురు ఎంత మాత్రం కనిపించడం లేదు. ఇంత పెద్ద మొత్తంలో దుర్వినియోగం జరిగినట్లు ఎలక్ట్రానిక్ మీడియాలతో సహా వివిధ మాధ్యమాల్లో కథనాలు వచ్చాక ధైర్యంగా ఉన్నాడు. ఈ ధైర్యం వెనుక ఎవరైనా పెద్దవాళ్లు ఉన్నారా అనే అనుమానాలు కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం రూరల్ మండలంలో 27 మంది రైతులకు సంబంధించిన రుణాల విషయంలో అవినీతికి పాల్పడినట్లు డిసిసిబి చైర్మన్, సిఈఓలకు సమాచారం చేరింది.విచారణకు కూడా ఆదేశించినట్లు సమాచారం.




2 లో..

# పిడుగుపడి తండ్రీ కూతురు మృతి

మద్దులపల్లి గ్రామంలో విషాద ఛాయలు



2లో...

కామేపల్లి, అక్టోబర్ 22 ప్రభాతవార్త: పిడుగుపాటు తండ్రి, కూతురును బలిగొన్న



# కేంద్ర ప్రాయోజిత పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

**(మొదటి పేజీ తరువాయి..)**

అధికంగా పండుతూ జిన్నింగ్ మిల్లులు లేని క్లస్టర్లను గుర్తించాలని, అక్కడ సిసిఐ ద్వారా జిన్నింగ్ మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ అధికారులకు సూచించారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే ఫిర్యాదు ప్రకారం సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్‌పై వేరే మండలాలలకు చెందిన అధికారులతో విచారణ నిర్వహించి ఆ నివేదికను నేరుగా జిల్లా కలెక్టర్, ఎంపీకి అందజేయాలని, విధులపట్ల నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడే సిబ్బంది, అధికారులను ఉపేక్షించేది లేదని ఎంపీ తెలిపారు. సత్తుపల్లిలో మంజూరైన ఆసుపత్రులలో సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లపై ఉన్నతాధికారులకు కలెక్టర్ ద్వారా నివేదిక సమర్పించాలని ఎంపీ సూచించారు. జిల్లాలో మంజూరైన జాతీయ రహదారుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించాలన్నారు. జిల్లాలో చేపట్టే రోడ్డు మరమ్మత్తు పనులు నాణ్యతతో పకడ్బందీగా చేపట్టాలని ఎంపీ సూచించారు. అటవీ ప్రాంతం నుంచి వచ్చే ఇసుకను సొంత అవసరాలకు ప్రజలు వాడుకునేందుకు గల అవకాశాలను పరిశీలించి అనుమతించాలని ఎంపీ అధికారులను కోరారు. యాసంగి నుంచి పంట భీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రైతుల తరపున భీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని, దీనికోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా అవసరం ఉన్న అంగన్‌వాడీ భవనాలు, మరమ్మత్తులకు గురైన భవనాల మొదలగు వివరాలను పార్లమెంట్ సభ్యులకు అందించాలన్నారు. సుగమ్య భారత్ అభియాన్ కింద దివ్యాంగుల కోసం ప్రజా సంచార ప్రదేశాలలో ప్రభుత్వం కల్పించిన ఇన్‌ఫ్రా వివరాలను అడిడ్ చేయాలని అన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు, పాలు, ఇతర పౌషకాహారం వినియోగం నాణ్యతను పరిశీలిస్తూ నివేదిక అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారిని ఆదేశించారు. జిల్లాలో 5 మండలాలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టు క్రింద చిన్నారి కార్యక్రమం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో పిల్లల హెల్ప్‌లైన్, డ్రగ్స్ వినియోగం, బాల్య వివాహాల నివారణ మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలో పండే పంటల ఆదారంగా ఏర్పాటు చేయడానికి అవకాశం గల పరిశ్రమల స్టడీ నిర్వహించామన్నారు. ఎథనాల్ ఫ్యాక్టరీ, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ, రైస్ మిల్లర్ల క్లస్టర్లు, ఫౌల్టీ, కారం తయారీ కేంద్రం, మొదలగు పరిశ్రమల ఏర్పాటుకు మన జిల్లాలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, ముద్రారుణాలు, పిఎంఎఫ్ఎంఈ, ముద్ర రుణాలు మొదలగు అంశాలపై ప్రచారం కల్పిస్తూ, అవసరం ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసేలా చూడాలని, రుణాలు పొందేందుకు ఏ దరఖాస్తులు సమర్పించాలి మొదలగు వివరాలను ఆసక్తి గల వారికి తెలియజేయాలని అన్నారు. జిల్లాలోని విద్యాసంస్థలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. అక్రమ బియ్యం తరలింపు నివారణకు తీసుకుంటున్న చర్యలు మరింత ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉండాలన్నారు. ప్రస్తుతం సన్నరకం ధాన్యం 500 రూపాయలు క్వింటాల్ బోనస్ అందిస్తున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. సన్నరకం బోనస్‌లో అవకతవకలను అరికట్టేందుకు ధాన్యం నాణ్యతతో పాటు సన్నరకం ధాన్యం రైతు ఆ గ్రామంలో పండించారని, ఇంత దిగుమతి వచ్చిందని వ్యవసాయవిస్తరణ అధికారులు ధృవీకరించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ కేంద్రాలలో కూడా సదరం క్యాంప్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం లక్షా 50వేల పైగా వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయని, మరో 15వేల వరకు పెన్షన్లు జారీ చేయాల్సి ఉంటుందని, ఇందులో డయాలసిస్ పేషెంట్లు కూడా ఉన్నారని, ప్రభుత్వం నుంచి నూతన పెన్షన్ మంజూరు కొరకు ఆదేశాలు వచ్చిన వెంటనే నూతన పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు అనువైన స్థలాలను ఎంపిక చేస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా ఇండ్లు లేఇ ప్రజలు ఎంతమంది ఉన్నారు. అందులో నిరుపేదలు ఎంతమంది మొదలగు ప్రాథమిక సర్వే నిర్వహించామని కలెక్టర్ వివరించారు. జిల్లాలో లబ్దిదారులకు పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల అప్రోచ్ రోడ్, ఇతర మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. నూతన డిఎస్సీతో మన జిల్లాలో 500 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు వచ్చారని అన్నారు. ఉపాధ్యాయుల కొరత లేనందున పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో కనీస మౌళిక వస్తువులు కల్పించామని అన్నారు. పాఠశాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘనలను ఎట్టి పరిస్దితులలో ఉపేక్షించడానికి వీలులేదని, సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకొని నివేదికను సత్తుపల్లి ఎమ్మెల్యేకు అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కొడిగుడ్ల నాణ్యతను తనిఖీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాలు, ఆయిల్ దుర్వినియోగం అవుతున్నాయని అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడిలు, రుణాలు మొదలగు అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పిఎంఎఫ్ఎంఈ ద్వారా గిరిజనులను పారిశ్రామికవేత్త తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశం గురించి తెలియజేస్తూ ఆసక్తి గలవారు అంది పుచ్చుకునేలా చూడాలన్నారు. మిల్లుల దగ్గర ధాన్యం నాణ్యతపై ఎటువంటి కొర్రిలు జరగకుండా చూడాలని, రైతులకు ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సదరం సర్టిఫికెట్ల జారీ కోసం ఖమ్మం జిల్లా కేంద్రానికి రావాల్సి ఉందని, ఇది దివ్యాంగులకు చాలా ఇబ్బందిగా ఉందని, నియోజకవర్గం హెడ్ క్వార్టర్‌లో కూడా నిర్వహించాలని ఎమ్మెల్యే తెలిపారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద మౌళిక వసతుల కల్పన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్యంగా వ్యవహరిస్తున్న హెడ్‌మాస్టర్‌కు అనుకూలంగా రిపోర్టు తయారుచేసి, సస్పెన్షన్‌కు గురైన హెడ్మాస్టర్‌ను అదే పాఠశాలలో ఎలా పోస్టింగ్ ఇచ్చారని, ఫిర్యాదు చేసిన తన అభిప్రాయం అడగకుండా విచారణ రిపోర్టు ఎలా రూపొందించారన్నారు. అదే హెడ్ మాస్టర్ నేడు పిల్లలతో సొంత పనులు చేయిస్తున్నారని, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నట్లు అన్నారు. సత్తుపల్లిలో మంజూరు చేసిన ఆసుపత్రి నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయి మొదలగు వివరాలను ఆరా తీశారు. పనులు పూర్తిచేయడంలో ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్‌కు నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు ఎలా అప్పగించారని, సింగల్ టెండర్ ఎలా అనుమతి ఇస్తున్నారని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. రోడ్డు మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. సత్తుపల్లి నుంచి కొవ్వూరు దారి మధ్యలో రైల్వేలైన్ దగ్గర ఆర్ఓబి లేదా అండర్ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరారు.

ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ వైరా బ్రిడ్జి మరమ్మత్తు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, అక్కడ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఇది అత్యంత ప్రాధాన్యతగా భావించి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. గత 10 సంవత్సరాల కాలంలో పేదలకు ఇండ్లు మంజూరు కాలేదని, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇసుక తరలింపు అవకాశం కల్పించాలన్నారు. స్టీల్ ప్లాంట్ రైల్వేలైన్, ఖమ్మం ఇల్లందు దారిలో రైల్వేలైన్ ఉందని, ఇక్కడ ఆర్ఓబి లేదా అండర్ బ్రిడ్జి మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామాల్లో గతంలో వేసిన విద్యుత్ స్థంబాలు మాత్రమే ఉన్నాయని, నూతన విద్యుత్ స్థంబాలు అవసరమున్న చోట వేయాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఎఫ్ఓ సిద్దార్ద్ విక్రమ్‌సింగ్, జెడ్పిసిఇఓ దీక్షారైనా, డిఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపడి తండ్రీకూతురు మృతి

**(మొదటి పేజీ తరువాయి..)**



విషాద సంఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు స్దానికుల కథనం మేరకు... మద్దులపల్లి గ్రామానికి చెందిన చింతల లింగస్వామి (50), కుమార్తె చింతల కావేరి (18) తమ పత్తి చేనులో పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో వారి సమీపంలోనే పిడుగుపడింది. దీంతో తండ్రి, కూతురు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్దానికులు పెద్ద సంఖ్యలో సంఘటన స్దలానికి చేరుకొని తండ్రి, కూతురు మృతి చెందిన తీరును చూసి కన్నీటి పర్వతమైయ్యారు. కూతురు కావేరి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. దసరా సెలవులకు వచ్చి తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేందుకు చేనుకు వెళ్ళింది. అయితే ఆమె మృతి చెందడంతో తోటి విద్యార్థులు సైతం గుండెలు పిక్కటిల్లెలా విలపించారు. స్దానికులు కారేపల్లి రూరల్ సీఐ బి.తిరుపతిరెడ్డి, కామేపల్లి తహాశీల్దార్ సిహెచ్ సుధాకర్, ఎస్సై బి.సాయికుమార్‌లకు సమాచారం అందజేయడంతో సంఘటన స్దలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. అనంతరం తండ్రి, కూతురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తండ్రి, కూతురు పిడుగుపాటుతో ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, బంధువులు కన్నీటి పర్యంతమైయ్యారు. పిడుగుపడి మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరగా మృతునికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదు

**వరంగల్ ట్రాఫిక్ ఎసిపి టి.సత్యనారాయణ**

*పోచమ్మ మైదాన్ కార్పొరేషన్, అక్టోబర్ 22, ప్రభాతవార్త*

వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆదేశాల మేరకు వరంగల్ ట్రాఫిక్ డివిజన్ 3 పోలీసుస్టేషన్ల పరిధిలోని 107 మంది మందుబాబులు మద్యంసేవించి వాహనాలు నడిపిన వారిని కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 100 మందికి రూ.1,42,400 జరిమానా విధించడంతో పాటు మరో ఏడుగురికి రెండు రోజులు సమాజ సేవ చేయాల్సిందిగా కోర్టు తీర్పునిచ్చింది. పుట్టశ్రీను, రేవోజు శ్రీనివాస్, మున్నా ఆలం, జల్లి యాకూబ్, మట్టుపల్లి శివ, కుమ్మరి శ్రీకాంత్, అన్నారపు కిషన్‌లు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా వరంగల్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వాహనదారులను పరీక్షించగా వాహనదారులు పెద్దస్థాయిలో మద్యం సేవించినట్టుగా నిర్ధారణ కావడంతో సదరు మద్యం సేవించిన వాహనదారులను మంగళవారం రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి ఎదుట మూడు పిఎస్‌ల పరిధిలోని కోర్టు కానిస్టేబుళ్లు హాజరు పరిచారు. కాగా సదరు వాహనదారులు సేవించిన మద్యం మోతాదును పరిశీలించిన రెండో తరగతి న్యాయమూర్తి కె.విద్యాసాగర్ మద్యం సేవించి వామనం నడపడాన్ని నేరంగా పరిగణిస్తూ సదరు వాహనదారులను రెండురోజులు సమాజ సేవ చేయాల్సిందిగా తీర్పునిచ్చారు. ఈ తీర్పునును సరించి స్థానిక కాజీపేట సర్కిల్ మున్సిపల్ కమిషనర్, స్థానిక హన్మకొండ మున్సిపల్ కమిషనర్ ఎదుట హాజరు పరిచారు. అంతేకాకుండా లైసెన్సు లేకుండా వాహనం నడిపిన 14 మందికి రూ.12,000 జరిమానా విధించినట్టు డివిజన్ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ ఆప్ పోలీసు ట్రాఫిక్ టి.సత్యనారాయణ తెలిపారు.




# సహకార మేనేజర్ స్వాహా పర్వం...!

**(మొదటి పేజీ తరువాయి..)**

ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిస్ జనరేషన్ ప్రోగ్రామ్ (ఎంఈజిపి) ఈ లోన్లు ఇచ్చే విషయంలో మేనేజర్లకు స్వేచ్ఛ ఉంది. ఆ యూనిట్ను చూసే దగ్గర నుంచి పూర్తి ఫైలు తన విచక్షణతోనే తయారు చేసి రూపాయలు 10లక్షల వరకు రుణం మంజూరు చేయవచ్చు. 25లక్షల నుంచి 30లక్షల వరకు కూడా తమపై అధికారులు పర్యవేక్షించినప్పటికీ మొత్తం యూనిట్‌కు సంబంధించి ఫైల్ మేనేజరే సిద్ధం చేస్తారు. పైన పేర్కొన్న పది లక్షల రుణాల విషయంలో సదరు మేనేజర్ తన సోదరులు బందువుల పేర్లతోనే రుణాలు మంజూరు చేసి సొమ్ము స్వాహా చేసినట్లు కూడా ఆరోపణలు వచ్చాయి. ఇక రైతులకు సంబంధించి ఇచ్చిన రుణాల్లో మంజూరైన సబ్సిడితోపాటు ముందుగా రైతులు చెల్లించిన సొమ్ములో కూడా స్వాహా జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. విషయం రచ్చకెక్కి వరకు సదరు మేనేజర్ విచారణను ఎదుర్కొక తప్పడం లేదు. ఇవిగాక ముద్రలోన్ల విషయంలోనూ చేతివాటం ప్రదర్శించినట్లు విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంటే గతంలో కూడా పలు ఆరోపణలు ఎదుర్కొన్న సదరు మేనేజరు తిరిగి మళ్లీ అందినకాడికి దోచుకునే పద్ధతిలో ప్రయాణిస్తుండడంతో ఈ కుంభకోణంలో ఇతను ఒక్కడే నా ఇతని వెనకాల కనపడని పెద్దల హస్తం ఏమైనా ఉందా అనే అనుమానాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు.

# చోరీ కేసులో నలుగురి అరెస్టు...

**- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రెహమాన్**

*చుంచుపల్లి, అక్టోబర్ 22 - (ప్రభాతవార్త):*

జిల్లా కేంద్రం సమీపంలోని విద్యానగర్‌కాలనీలో ఉన్న ఆర్‌కే సూపర్ మార్కెట్ వద్ద జరిగిన చోరీ కేసుకు సంబంధించి నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 9వ తేదీన కొత్తగూడెం రైటర్‌బస్తీకి చెందిన రిటైర్డ్ సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ బొడ్డపాటి వెంకటేశ్వరరావు పోస్టాఫీస్ బ్రాంచ్ ఎస్‌బీఐ బ్యాంకు లాకరులో ఉన్న తన భార్య నగలు తీసుకొని రావడానికి వెళ్లారు. లాకరులో నుంచి బంగారు కడియం, ఒక జత బంగారు గాజులు, బంగారు గొలుసు, లాకెట్, బంగారు మల్లెపూల గొలుసు మొత్తం 19 తులాల నగలను తీసుకున్నారు. అక్కడి నుంచి కారులో కిరాణా సామాన్ల కోసం విద్యానగర్‌కాలనీలోని ఆర్‌కే సూపర్‌మార్కెట్‌కు వచ్చారు. అక్కడ సరుకులు తీసుకొని తన కారు డిక్కీలో సర్దుతున్నారు. ఇదంతా గమనిస్తున్న అక్కడే ఉన్న తంబల్ల నితీష్ అలియాస్ రాజు అలియాస్ నాని కారు ముందు తలుపు తీసి ఆ నగలను ఎత్తుకెళ్లాడు. ఇది తెలియక డిక్కీ క్లోజ్ చేసి వచ్చి కారును స్టార్ట్ చేయడానికి కూర్చున్న వెంకటేశ్వరరావుకు నగల బ్యాగు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురై అక్కడ ఉన్న వారిని అడిగాడు. వెంటనే చుంచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారు కడియం (60 గ్రాములు), ఒక జత గాజులు (50 గ్రాములు), గోల్డ్ చైన్, లాకెట్ (50 గ్రాములు), బంగారు జాస్మిన్ చైన్ (30 గ్రాములు) మొత్తం 19 తులాల బంగారం చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు



నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. అసలు దొంగలను పట్టుకున్నారు. ఏ1 నిందితుడు నితీష్ వద్ద నుంచి గోల్డ్ చైన్, లాకెట్, రియల్‌మీ ఫోన్, నంబర్ ప్లేట్ లేని బజాజ్ ఆటో, లగ్జరీ సోఫా సెట్‌తో పాటు ఈ కేసులో నిందితులైన ఏ2 నిమ్మల వినయ్‌కుమార్ అలియాజ్ చింటు అలియాజ్ పులి నుంచి రూ.9600 నగదు, ఏ3 నిందితుడు గుంజి వీరబాబు నుంచి రూ.10,400 నగదు, వీవో స్మార్ట్ ఫోన్, ఏ4 నిందితుడు మహ్మద్ నయీం నుంచి రూ.7400 నగదు, రియల్‌మీ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మిగిలిన సొత్తు రికవరీ చేస్తున్నట్లు చెప్పారు.

# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి బాధ్యతగా కృషి చేయాలి

**- నేరస్తులకు శిక్షపడినప్పుడే నేరాలు తగ్గుముఖం- పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను విజయవంతం చేయాలి**

**- నెలవారి నేర సమీక్షలో ఎస్పీ రోహిత్‌రాజు**

*కొత్తగూడెం క్రైం, (ప్రభాతవార్త):*

పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వర పరిష్కారానికి పోలీసు అధికారులు బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ ఏ హాల్‌లో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పెండింగ్‌లో ఉన్న కుపేసుల సత్వర పరిష్కారానికి అందరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉనర్న పలు కేసులు వివరాలను, వాటి పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొత్త కొత్త టెక్నాలజీలతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల ఖాతాల నుంచి నగదు మాయం చేస్తున్నారని, ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా బాధ్యతగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని సూచించారు. దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని



సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలకు అనునిత్యం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ వారిని అప్రమత్తం చేయాలని తెలిపారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారితో పాటు సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. గుట్కా మట్కా జూదం బెట్టింగు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని తెలిపారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసుకొని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు.



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఫింగర్ ప్రింట్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన చంద్రుగొండ ఎస్సై స్వప్నను అభినందించారు. ఈ సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, జిల్లా పోలీస్ కార్యాలయం ఏవో జయరాజు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు భద్రాచలంలో రాష్ట గవర్నర్ పర్యటన

*భద్రాచలం, (ప్రభాతవార్త) :*



భద్రాచలం పట్టణంలో గురువారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ పర్యటన మంగళవారం అధికారికంగా ఖరారైంది. గురువారం వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల నిమిత్తం కోదాడ చేరుకున్న గవర్నర్ అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బూర్గంపహాడ్ మండలంలోని సారపాకలో గల ఐటీసీ గెస్ట్ హౌస్‌కు చేరుకోనున్నారు. రాత్రి అక్కడే బస చేసి శుక్రవారం ఉదయం 8 గంటలకు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకోనున్నారు. దర్శనం అనంతరం భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పర్యటనకు వెళ్లనున్నారు. దీంతో గవర్నర్ పర్యటనకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు.

## డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య..

*కూసుమంచి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త) :*

కూసుమంచి మండలం గంగబండతండా గ్రామానికి చెందిన సుబ్బమ్మ, నాగేశ్వరరావు దంపతుల కుమార్తె చైతన్య (19) మంగళవారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. తనికెళ్ల వద్ద నున్న ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఇటీవల దసరా పండుగ సెలవులకు ఇంటికి వచ్చింది. అప్పటినుంచి ఇంటి వద్దే ఉంటుంది. మంగళవారం తల్లిదండ్రులు చేనుపనులకు వెళ్లగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి రాగా కూతురు ఉరివేసుకుని ఉండడం చూసి బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న కూసుమంచి ఎస్సై నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు

*భద్రాచలంకల్చరల్, (ప్రభాతవార్త) :*

నీటిపారుదల శాఖ సర్కిల్ కార్యాలయం నందు మంగళవారం కొమురం భీమ్ జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ జిల్లా కార్యదర్శి శ్యామల శ్రీనివాస్ మాట్లాడుతూ .. ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగం చేయడం అనేది పూర్వజన్మ సుకృతం అని, అదికాక ఏజెన్సీ ఆదివాసీ ఆరాధ్య



దైవం కొమురం భీమ్ అని, అతని యొక్క అడుగుజాడల్లో ప్రతి ఒక్క ఉద్యోగస్తుడు వారి జాతి వారికి ఇతోధికంగా సహాయ సహకారాలు అందించాలని తెలియజేశారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాధిక్‌భాషాతో పాటు, టీఎన్‌జీవో సెక్రటరి గగ్గూరి బాలకృష్ణ, ట్రెజరర్ పడిగ నరసింహారావు,గాంధీ, లింగమూర్తి, రమణ, విజయ్‌కుమారి, శ్రీనివాస్, పాపారావు, తదితర ఆదివాసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# నేరాలు-దారుణాలు

## రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో జిల్లా పోలీస్ జాగిలం జూనోకు బంగారు పతకం



*కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 22 - (ప్రభాతవార్త):*

తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగిన తెలంగాణ పేలుడు పదార్థాలు (ఎక్స్‌ప్లోజీవ్స్)ను కనిపెట్టే విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన జిల్లా పోలీస్ జాగిలం జూనోను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విభాగంలో మొత్తం 21 పోలీస్ జాగిలాలు పాల్గొనగా అందులో జూనో అత్యుత్తమ ప్రతిభను కనపర్చి బంగారు పతకాన్ని సాధించడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేశారు. జూనో హ్యాండ్లర్ హుస్సేన్‌ను కూడా ప్రశంసించారు. ఇదే విధంగా జాతీయ స్థాయిలో కూడా తన ప్రతిభను కనపర్చి రాష్ట్రానికి బంగారు పతకాన్ని సాధించేలా శిక్షణ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, ఆర్ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తనయుడి మృతితో ఆగిన తల్లిగుండె

*ఇల్లెందు టౌన్, (ప్రభాతవార్త):*





కుమారుడి మృతితో గుండెల విసెలా ఏడ్చింది.. రొమ్ములు బాదుకుంటూ కొడుకు స్మృతులను తలుచుకుంటూ అల్లాడిపోయింది..వయస్సులో పెద్దవాడైనా కొడుకు హఠాన్మరణం ఆ వృద్ధతల్లికి కొడుకు మీదున్న అపారప్రేమతో కన్నీళ్లు నిలువకున్నాయి..కొడుకు హృదయంపై తలపెట్టి లేవరా బిడ్డ అంటూ వృద్ధతల్లి చిన్నపిల్లలా అల్లాడిపోయిందిదు కుమారుడి పార్థివ దేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తరలిస్తున్న క్రమంలో ఆ తల్లిగుండె ఒక్క సారిగా ఆగిపోయిన ఘటన ఇల్లెందు పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళితే ఇల్లెందు పట్టణంలోని జగదాంబ సెంటర్ సీతారామ టాకీస్ వెనకాల గల కొడిపేర్ల ఆస్పత్రానా మాలిక పసుపులేటి నరేందర్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మృతి చెందిన విషయం విధితమే. వైజాగ్‌లోని రెండవ కుమారుడి వద్ద ఉంటున్న తల్లి సులోచన కుమారుడి మృతితో ఇల్లెందుకు చేరుకుంది. కుమారుడు మృతి చెందిన విషయం ఇల్లెందుకు వచ్చే వరకు కుటుంబ సభ్యులు తెలుపకపోగా కుమారుడి మృతదేహాన్ని చూసి ఒక్కసారిగా ఆతల్లి రోదనలు మిన్నంటాయి. సోమవారం రాత్రి వరకు కుమారుడి కోసం ఏడుస్తూ ఉండిపోయింది. మంగళవారం కుమారుడి దహనసంస్కారల నిమిత్తం వైకుంఠదామానికి తరలిస్తున్న క్రమంలో ఆ తల్లి గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో ఆ కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆ తల్లి గుండె ఆగిపోవడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వాల్లు తీవ్ర దిగ్భ్రాంతిలో ఉండిపోయారు. ఏది ఏమైనా ఒకే కుటుంబంలో రెండు దుర్ఘటనలు చోటుచేసుకోవడంతో ఆప్రాంత మంతా విషాదఛాయలు అలుముకున్నాయి.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

*భద్రాచలంటౌన్, (ప్రభాతవార్త) :*

ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు భద్రాచలం పట్టణానికి చెందిన ఆరోగ్యం బాగోలేక ప్రైవేటు హస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ పొంది శిల్పినగర్ కాలనీకు చెందిన ఉపేందర్‌కు సీఎంఆర్ఎఫ్ రూ.60వేలు చెక్కును కుటుంబసభ్యులకు అందచేశారు. కుటుంబసభ్యులు ధన్యవాదాలు ఎమ్మెల్యే కు తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నం రమాకాంత్, అరికెల తిరుపతిరావు, భీమవరపు వెంకట్‌రెడ్డి, గాడి విజయ్, పాల్గొన్నారు.

# బాలికలు జీవితంలో ఉన్నతమైనస్థానంలో ఉండాలి

## -జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

ప్రతీ అమ్మాయి బాగా చదువుకొని జీవితంలో ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా అన్నారు. ఈనెల 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు దసరా సెలవులు ఉండడంతో మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా, శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్‌లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌లతో కలిసి కలెక్టర్ పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళల సంక్షేమం, బాలికల కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, పిల్లలకు సమయానికి పౌష్టికాహారం, ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నామని, అలాగే వైద్య శాఖ ద్వారా జిల్లాలోని మహిళలకు, పిల్లలకు మెరుగైన వైద్యం అందిస్తూ మహిలలు, పిల్లలు పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండేలా వైద్యశాఖ సిబ్బంది కృషిచేస్తున్నారన్నారు. జిల్లాలో అనీమియా బాదితులు లేకుండా తగు చర్యలు చేపట్టామన్నారు. మహిళలు ఎదుర్కొనే



సమస్యలకు సఖీ సెంటర్ ద్వారా న్యాయపరమైన చేయూత ఇస్తున్నామని అలాగే మహిళా పోలీసుల ద్వారా మహిళల రక్షణ మీద స్పెషల్ ఫోకస్‌పెడుతున్నామన్నారు. జిల్లాలోని విద్యార్థులలో 70శాతం మంది బాలికలే ఉన్నారని, ఏ పోటీల్లో చూసిన టాప్ 10లో బాలికలదే పై చేయిగా ఉంటుందన్నారు. మన జిల్లాలో క్రీడా పోటీలు, కల్చరల్ పోటీలు ఇలా ఏ పోటీలు నిర్వహించిన బాలికలే ఎక్కువమంది ముందుకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీతత్వం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని, ఇంటర్, డిగ్రీతో చదువును ఆపేయకుండా పోటీపరీక్షలలో కూడా బాలికలు తమ ప్రతిభను చూపెట్టి జీవితంలో మంచి ఉన్నతస్థానంలోసెటిల్ అవ్వాలన్నారు. చదువు తరువాత పెళ్లిచేసుకొని ఇంటికి పరిమితం కాకుండా మీలో ఉన్న ప్రతిభను బయటపెట్టి ఎవరిమీద ఆధారపడకుండా జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడాలన్నారు. విద్యార్థులే కాక జిల్లాలోని వివిధ శాఖల్లో కూడా మహిళా ఉద్యోగులు ఎక్కువగా ఉండడం గమనార్హం అన్నారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో పోస్టర్‌ను కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, డీఆర్డఈవో పీడీ వసంత, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ కులాల అభ్యున్నతికి నిరంతర కృషి

జనగామ టౌన్, అక్టోబరు 22 ప్రభాతవార్త :



షెడ్యూల్ కులాల అభ్యున్నతికి నిరంతరం కృషిచేస్తామని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ సంబంధిత పోలీస్, రెవెన్యూ అధికారులతో కమిటీ సభ్యులతో జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో జిల్లా కలెక్టర్ పాల్గొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, అంబేద్కర్ భవనం, ఎస్సీ,ఎస్టీ వసతిగృహాలు, స్టడీ సర్కిల్ భవనంల ఏర్పాటు మొదలగు అంశాల మీద సమగ్రంగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ పరిధిలో ఆర్థికసాయం అందించే కేసులు పెండింగ్‌లో లేవన్నారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులు త్వరగా పరిష్కారం అయ్యేవిధంగా కృషిచేస్తున్నామన్నారు. వసతి గృహాల విద్యార్థులందరూ ఒకేచోట విద్యను అభ్యసించే విధంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో 25ఎకరాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అంబేద్కర్ భవనం స్టడీ సర్కిల్ భవనం నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందగానే తగిన భూమిని కేటాయిస్తామన్నారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కొత్త బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విక్రమ్, ఏసీపీలు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల, మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి వైద్యుల నియమకానికి చర్యలు చేపట్టాలి

## -జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రభాతవార్త ప్రతినిధి - జయశంకర్ భూపాలపల్లి



చిట్యాల, మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి వైద్యులు నియామకానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు, టిజి ఎంఎస్ఐడిసి, వైద్యులతో సిబ్బంది ఖాళీలు, ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మాణానికి అనువైన స్థలం కేటాయింపు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, సౌకర్యాలు కల్పన, ఖాళీ పోస్టులు నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరన మాట్లాడుతూ మొత్తం వైద్య సిబ్బంది, అందుబాటులో ఉన్న సిబ్బంది, పోస్టులు ఖాళీలపై జిల్లా వైద్యాధికారి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు సంయుక్త నివేదికలు అందజేయాలని పేర్కొన్నారు. సమీక్షలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్న కలెక్టరన త్వరితగతిన ప్రక్రియ పూర్తిచేసేలా కృషి చేయాలని ఆదేశించారు. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి అనుకూలమైన భూమి కేటాయించాలని సూచించారు. పలు మండలాల్లో ఉన్న ఉప ఆరోగ్య కేంద్రాలు తగిన సదుపాయాల లేమితో ఉండటాన్ని పరిగణలోకి తీసుకొని, ఆయా కేంద్రాలకు తక్షణమే అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా డ్యూటీ రోస్టర్ నిర్వహిస్తున్నారో లేదో రెగ్యులర్‌గా సమీక్షించే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. సౌకర్యాలు కల్పనకు అవసరమైన నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నిధుల ద్వారా ఉప కేంద్రాలలో అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తద్వారా జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

## -జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :



దేవాదుల ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా అన్నారు. దేవాదుల ప్రాజెక్టు భూసేకరణ మీద రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన దేవాదుల భూసేకరణ ప్రక్రియ పూర్తి అవ్వాలన్నారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా సంబంధిత వారికి నోటీసులను త్వరగా ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ సంబంధిత అధికారులు, సర్వేయర్లు కోఆర్డినేట్ చేసుకొని జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి భూ సేకరణ పనులు త్వరగా అయ్యేలా పనిచేయాలన్నారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, కలెక్టరేట్ ఏవో మన్సూరి, జనగామ ఆర్డిఓ కొమురయ్య, ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, ఈఈ, డీఈలు, ఏఈలు, రెవెన్యూకు సంబంధించి ఆయా మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

# గప్ చుప్‌గా గుట్కాదందా

## -బయ్యారంలో నయా సిండికేట్ వ్యాపారం

## -బస్తాలకొద్ది గుట్కాపాకెట్‌ల రవాణా

బయ్యారం,అక్టోబర్22,ప్రభాతవార్త:

గుట్కాదందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. పల్లె నుండి పట్నం దాకా ఎక్కడ పడితే అక్కడ జోరుగా వ్యాపారం సాగుతుంది. టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేస్తున్నా అమ్మకాలు మాత్రం ఆగడంలేదు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తున్న అక్రమార్కుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. ఇళ్లలోనే గోదాములుగా ఎంచుకొని గుట్కామాఫియా చెలరేగిపోతుంది. గ్రామాలు, తండాల్లోని బడ్డికోట్లు, కిరాణ దుకాణాలు, పాన్‌షాపుల్లో ఇవే దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయల వ్యాపారం చాపకింద నీరులా సాగుతుంది. లాభార్జనే ధ్యేయంగా అక్రమార్కులు యదేచ్ఛగా గుట్కాను




విక్రయిస్తూ యువతను మత్తులో ముంచెత్తుతున్నారు. మార్కెట్‌లో గుట్కాప్రియులు ఎక్కువగా ఉండటంతో గుట్కాలకు భారీగా డిమాండ్ పెరుగుతుంది. బయ్యారంలో అక్రమ వ్యాపారులు సిండికేట్ అయి క్యాష్ చేసుకుంటున్నారు. గతంలో రెండు రూపాయలకు దొరికే ప్యాకెట్‌లు ఇప్పుడు ఇప్పుడు 15నుండి 20దాకా అమ్ముతున్నారన్నారు. గుట్కా వ్యాపారం వెనుక అనేక మందికి మాముళ్లు ముట్టచెబుతున్నారనే చర్చ జరుగుతుంది. గుట్కా జోలికి వెళితే ప్రాణం గుటుక్కు మనేది ఖాయమని వైద్యులు హెచ్చరిస్తున్నా గుట్కాప్రియులు వాటి కోసం పరితపిస్తున్నారు.

**-జిల్లా సరిహద్దు అక్రమాలకు అడ్డ...**

ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా కేంద్రాలకు సరిహద్దు మండలం బయ్యారం కావడంతో సరుకు నిల్వలకు అణువుగా ఉండడం అక్రమార్కులకు వరంగా మారింది. బెల్లం, గుట్కా ఏ నిషేదిత పదార్థాల క్రయవిక్రయాలు ఆ ప్రాంతంలో ఎక్కువగా జరుగుతుంటాయి. గుట్కాలు జిల్లా కేంద్రాల నుండి నేరుగా మండలానికి చేరుతున్నాయి. ప్రజల ఆరోగ్యం పట్టించుకునే నాధుడే కరువయ్యారు.

# నేడు కలెక్టరేట్ ముట్టడి

*కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*



అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన కలెక్టరేట్ జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ పిలుపునిచ్చారు. అనేక సంవత్సరాల నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్షిప్స్, బకాయిలు చెల్లించక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కాక ఇటు ప్రైవేట్ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపై చదువులు చదువుకోవాలన్న చదువలేని స్థితిలో విద్యార్థులు ఉన్నారని 7 వేల కోట్లు పైకి ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్షిప్స్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం బకాయి ఉందని గత బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయక విద్యార్థులు ఉసురు పోసుకుందని, అదే దారిలో కాంగ్రెస్ ప్రభుత్వం నడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్షిప్స్ చెప్పిందని ఇప్పటి వరకు చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుండల సుజన్, రాజేష్, రాజు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలి



*పాల్వంచ టౌన్, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*

పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న స్వచ్ఛభారత్ ఆటో కార్మికులకు జీతాలు లేకుండా ఇబ్బంది పడుతున్న విషయమై బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు, వేల్పుల రమేష్‌లు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ కార్మికలు సంవత్సరాల తరబడి జీతాలు లేక కుటుంబాలను పోషించుకోవటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పూనెం రమేష్, నిట్టా అమృతరావులు పాల్గొన్నారు.

# ట్రాలీ డ్రైవర్లు, హెల్పర్లకు జీతాలు ఇవ్వాలి: పొనిశెట్టి



*పాల్వంచ టౌన్, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*

పాల్వంచ మున్సిపల్ కార్యాలయం పక్కన స్వచ్ఛభారత్ ట్రాలీ డ్రైవర్లు, హెల్పర్లు వారి జీతాల కోసం కోళ్లముడి ప్రవీణ్ ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీ రాష్ట్ర నాయకుడు కామేష్ చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మద్దతు ఇచ్చిన బీజేపీ పార్టీ అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. పాల్వంచ మున్సిపాలిటీలో చాలా రోజుల నుంచి పనిచేస్తున్న స్వచ్ఛభారత్ ట్రాలీ డ్రైవర్లు, హెల్పర్లకు అధికారులు ఎటువంటి జీతం ఇవ్వడం లేదని, వారికి కూడా అందరిలాగే నెలవారి జీతాలు ఇవ్వాలని కోరారు. సుమారు 57 మంది స్వచ్ఛభారత్ ట్రాలీ డ్రైవర్లు, హెల్పర్లు దీక్ష చేస్తున్నారని, దీక్షా శిబిరం వద్ద ఆయన చేఉరుకొని సంఘీభావం తెలిపారు. ఇప్పటికీ స్వచ్ఛభారత్ ట్రాలీ డ్రైవర్లు, హెల్పర్లకు అనేకసార్లు జీతాల కోసం దీక్షలు చేశారని, మిగిలిన చోట్ల స్వచ్ఛభారత్ ట్రాలీ డ్రైవర్లకు, హెల్పర్లకు జీతాలు ఇస్తుంటే పాల్వంచలో మాత్రం కేవలం మున్సిపాలిటీ ఎన్నికలు లేవని, ఎన్నుకున్న వార్డు కౌన్సిలర్ లేరు అనే వంక చెప్తూ అధికారులు జీతాలు ఇవ్వట్లేదని అన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదారపు లక్ష్మణ్, బత్తుల వెంకటేశ్వర్లు, మాలోత్ ప్రశాంత్ నాయక్, గందమళ్ల కిరణ్ గౌడ్, రవి పాల్గొన్నారు.

# అత్యధిక సభ్యత్వ నమోదు కావాలి



*కొత్తగూడెం/సుజాతనగర్, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*

సభ్యత్వ నమోదు 2024 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని సుజాతనగర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు భూక్యా రాజేష్ ఆధ్వర్యంలో పత్తి రైతుల వద్దకు వెళ్లి , వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ పొనిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఈ దేశ ప్రజలు మోడీ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని, కాబట్టి ప్రతిపక్షాలు ఎన్ని అబద్దపు ప్రచారాలు చేసినా ప్రజలు మోడీని మూడోసారి ప్రధాని చేశారని అన్నారు. అదే విధంగా ఈ దేశ ప్రజల అబివృద్ధి, భద్రతే ముఖ్యం అని పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ అని ప్రజలు గుర్తించి ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలోత్ గాంధీ, మాలోత్ ప్రశాంత్ నాయక్, కందురు లక్ష్మీనారాయణరెడ్డి, మోహన్, భూక్యా బాలు, గణేష్, విజయ్, నరేష్, రెడ్డి, హర్షవర్ధన్, శ్రీను, శంకర్, భిక్కులాల్, బలరాంలు పాల్గొన్నారు.

# రూ.16.70 కోట్లతో అభివృద్ధి నిధులు మంజూరు

*- అభివృద్ధికి అహర్నిషలు శ్రమిస్తా : ఎమ్మెల్యే కూనంనేని*

*కొత్తగూడెం, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*



సుధీర్ఘకాలంగా గ్రామీణ, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిర్విరామంగా చేస్తున్న కృషికి అనతికాలంలోనే ఫలితాలు లభిస్తున్నాయి. పట్టణంలోని పాత కొత్తగూడెం నుంచి చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి రహదారిలో శిధిలావస్థకు చేరిన బ్రిడ్జి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన కూనంనేని ప్రతిపాదనలు అందించిన ఫలితంగా బ్రిడ్జి, రోడ్డు నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. నాన్యాతండా మీదుగా బేతంపూడి నల్లవాగు వరకు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80 కోట్లు, పాల్వంచ మండలంలోని సోములగూడెం రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.4 కోట్లు, లక్ష్మీదేవిపల్లి మండలంలో గడ్డిగుట్ట తండా మీదుగా తెలగరామవరం నుంచి పులిగుండం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయాలు, పాల్వంచ మండలంలో పుల్లాయిగూడెం నుంచి ప్రభాత్‌నగర్ వరకు గతంలో మంజూరైన కోటితో కలిసి రూ.1.70 కోట్లు, లక్ష్మీదేవిపల్లి మండలంలోని సీతారాంపురం నుంచి రూప్లాతండా రోడ్డులో కోటి రూపాయాలతో నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి.

# నేడు సీఈఆర్ క్లబ్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

*కొత్తగూడెం, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*



సింగరేణి సేవా సమితి అన్ని ఏరియాల్లో ఉన్న సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంత వాసుల ఆరోగ్య సౌకర్యార్థం ఆయుర్వేద వైద్య శిబిరాలను నిర్వహిస్తుంది. మాత రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద హైదరాబాద్ వారి సౌజన్యంతో ఏరియాలో ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని బుధవారం మద్యాహ్నాం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జీఎం పర్సనల్ సామ్యూల్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి పాల్గొని ఉచిత వైద్యసేవలతో పాటు తక్కువ ధరలకే మందులను కూడా అందిస్తారని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వినీష్ కుటుంబానికి హనుమాన్ యూత్ చేయూత

*చిట్యాల రూరల్, అక్టోబర్, 22, ప్రభాతవార్త :*

చిట్యాల మండలంలోని సుంకెనపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి శంకరయ్య కుమారుడు అవిశెట్టి వినీష్ ఈ నెల 13న విద్యుదాఘతంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి హనుమాన్ యూత్ అసోసియేషన్ గుండ్రాంపల్లి సభ్యులు బాసటగా నిలిచారు. మంగళవారం హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆ గ్రామంలోని వినీష్ నివాసానికి వెళ్లి అతడి తల్లిదండ్రులను పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు. యూత్ తరుపున రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించి ఉదారతను చాటుకున్నారు.




## చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్

# కమ్యూనిటీ హాల్‌లో సౌకర్యాలు కల్పించాలని వినతి



*రుద్రంపూర్, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*

రామవరం కమ్యూనిటీ హాల్‌లో వాటర్ కోసం బోర్, పార్కింగ్ ఏర్పాటు చేయాలని జీఎం శాలెంరాజుకు ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు . కమ్యూనిటీ హాల్ చూట్టూ ప్రహరీగోడపై మెస్ ఏర్పాటు చేయాలని, వాష్ బేషిన్ ఏరియాలో ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేఉయాలని, కోతులు రావడానికి అవకాశం ఉందని, కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి హానికలగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బుటిక రాజేశ్వరరావు, గోపు కుమారస్వామి, చిలక రాజయ్య, సత్తార్ పాషా, నటరాజ్, కుమార్, సాగర్, కాసర్ల సమ్మయ్య, చందులాల్, కలవల శ్రీనివాస్, నీలం సమ్మయ్య, కొప్పుల కుమార్, లక్ష్మణ్ రాజు, రమేష్, వెంకట్, కుమార్, ఈశ్వర్, కిషోర్, వెంకటేశ్వర్లు, సైమన్, రెహమాన్‌లు పాల్గొన్నారు.

# బహుజన జేఏసీ ఆధ్వర్యంలో భీం జయంతి



*లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*

మండల కేంద్రంలో బహుజనుల జేఏసీ ఆధ్వర్యంలో కొమరం భీం జయంతిని నిర్వహించారు. బీజేపీ నాయకుడు పోడియం బాలరాజు, కాంగ్రెస్ నుంచి పూనెం శ్రీనివాస్, ఆదివాసీ ఉద్యోగ సంఘాల నుంచి వర్సా లక్ష్మణ్, దళిత హక్కుల నాయకులు అంతడపుల కృష్ణ, ముస్లీం మైనార్టీ నుంచి ఎండీ అఫ్సర్ ఖాన్, బీసీ రిజర్వేషన్ సాధన కమిటీ నుంచి తాళ్లపల్లి రాజుగౌడ్‌లు పాల్గొన్నారు. ఆదివాసీల జన్మహక్కులు జల్, జంగల్, జమీన్ అని షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీలకు సమన్యాయం ఉండాలని నిజాం సర్కార్ పాలనలో మగ్గిపోతున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల స్వేచ్ఛ, హక్కుల కోసం నిజాం ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి రజాకారు సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు కొమరం భీం అన్నారు. ఈ కార్యక్రమంలో తాటి పద్మ, బండ వెంకటేశ్వర్లు, చింతా సుజాత, చింతా నాగమణి, తిరుమలేష్, చందు, సూరిబాబులు పాల్గొన్నారు.

# నేడు రుద్రంపూర్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

*రుద్రంపూర్, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*



ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం శాలెంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి పాల్గొని ఉచిత వైద్య సేవలు అందిస్తారని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా తక్కువ ధరలకే మందులను కూడా అందిస్తారని అన్నారు. స్థానిక రుద్రంపూర్ సేవా సెంటర్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మద్యాహ్నాం ఒంటిగంట వరకు ఉంటుందని, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## త్యాగాలకు, పోరాటాలకు మారుపేరు సీపీఐ పార్టీ



**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 22 :**
సీపీఐ నాయకుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే ఈ ప్రాంతంలో పేద ప్రజలు ధైర్యంగా నివశిస్తున్నారని, సీపీఐ పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యాచారి అన్నారు. ఆయన మంగళవారం చిక్కుడుగుంట గ్రామంలో కామిశెట్టి రామారావు అధ్యక్షతన జరిగిన సీపీఐ గ్రామశాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో మైన కొండయ్య వంటివారు పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పనిచేశారన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో అనేక గ్రామాలు, ఇండ్లు నిర్మించి, రోడ్లు, విద్యుత్, స్కూల్స్ నిర్మించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఉందన్నారు. వారి త్యాగాలు వృధా కాకుండా ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 26 నాటికి సీపీఐ ఆవిర్భవించి 100సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున శాఖ నిర్మాణ మహాసభలు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ కార్యక్రమాలకు పెద్దఎత్తున తరలిరావాలని, అందరూ ఐక్యంగా కలిసి ఉండి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమించిన వీరుడు కొమురంభీమ్



**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 22 :**
నిజాం నవాబులకు వ్యతిరేకంగా జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఉద్యమించిన వీరుడు కొమురంభీమ్ అని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. కొమురంభీమ్ జయంతి సందర్భంగా మంగళవారం మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లోని కొమురంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమురంభీమ్ చేసిన తిరుగుబాటు, పోరాటాలు ఆదర్శంగా ఆదివాసీలు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మా సొసైటీ ఇసుకను మాకే కేటాయించాలి




**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 22 :**
మా సొసైటీ ఇసుకను మాకే కేటాయించాలని, మమ్ముల్ని బెదిరించిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మణుగూరు మండలం చినరావిగూడెం గ్రామానికి చెందిన సమ్మక్క-సారక్క ట్రైబల్ శాండ్ స్వారీ లేబర్ కాంట్రాక్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం మణుగూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మా సొసైటీని రద్దుచేయించి మా అంతు చూస్తానని బెదిరించిన గంట్ల రమేష్ అనే వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేయాలని, మాసొసైటీకి న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ తెల్లం వెంకటరమణ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా గిరిజన పాఠశాల విద్యార్థుల ఎంపిక
### -డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి మణెమ్మ



**భద్రాచలం, ప్రభాతవార్త :**
గిరిజన విద్యార్థిని, విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థిని, విద్యార్థుల కొరకు అనేక వసతి సౌకర్యాలు కల్పించామని డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి మణెమ్మ అన్నారు. మంగళవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జిల్లాలోని గిరిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపబడుతున్న, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశానికి భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపబడుతున్న, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లలో



ప్రవేశానికి భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని గిరిజన బాల, బాలికలు 75 మంది ధరఖాస్తు చేసుకోగా వారిని పిల్ల తల్లిదండ్రులు, కమిటీ సభ్యుల సమక్షంలో ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా అందరి సమక్షంలో లాటరీ ద్వారా బాలబాలికలను ఎంపిక చేశామని అన్నారు. 6వ తరగతిలో 21 సీట్లు, ఏడవ తరగతిలో 7 సీట్లు, 8వ తరగతిలో 8 సీట్లు, పదవ తరగతిలో 02 సీట్లు లాటరీ పద్ధతిలో డ్రా తీసి ఎంపిక చేయడం జరిగిందని ఆమె అన్నారు. పిల్లల యొక్క తల్లిదండ్రులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో సీట్లు సంపాదించిన పిల్లలను తప్పనిసరిగా చేర్పించాలని తెలుపుతూ, సీట్లు లభించిన బాలబాలికలను ఆమె అభినందిస్తూ, బాగా చదివి మీ తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎంఈవో రామ, ఏసీఎంవో రమణయ్య, వికాసం పాఠశాల హెచ్ఎం అరుణకుమారి, ఏటీడీవోలు చంద్రమోహన్, రాధమ్మ, ఏవో ప్రమీలభాయ్, రామకృష్ణారెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొమురంభీమ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 22 :**
ఆదివాసీ ముద్దుబిడ్డ, పోరాటయోధుడు కొమురంభీమ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసీలంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. కొమురంభీమ్ జయంతి సందర్భంగా మంగళవారం మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లోని కొమురంభీమ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆదివాసీ సంఘాలు సమాజ అభివృద్ధి కోసం పాటుపడాలని కొమురంభీమ్ ఆశయాలైన జల్ జంగిల్ జమీన్‌ను నినాదంగా తీసుకొని ఆదివాసీలంతా భవిష్యత్తు కొరకు ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు పీర్నాకి నవీన్, మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




**పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మీదేవిపల్లి, చంద్రుగొండ**

## ఆదివాసీలపై కేసులు పెడితే ఊరుకునేది లేదు



**ములకలపల్లి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**
రహదారి సమస్యపై మండల కేంద్రం ములకలపల్లిలో ధర్నా చేస్తున్న తాళ్ళపాయి 11 మంది ఆదివాసీలపై కేసులు పెట్టించిన ఎమ్మెల్యే పద్ధతి సరికాదని ఆదివాసీ జెఎసి రాష్ట్ర నాయకులు కుంజా రాజులు పేర్కొన్నారు. మంగళవారం ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాళ్ళపాయి పంచాయతీ వాసులు సైడ్ రోడ్డు సమస్యపై ప్రధాన సెంటర్‌లో ఆందోళన చేశారని కాని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కావాలనే ఆదివాసీలపై ప్రత్యేక కేసులు బనాయించారని ఆరోపించారు. ఆదివాసీల సమస్యలపై ఎవరు పోరాడినా ఆందోళన ధర్నా చేసినా ఎమ్మెల్యే నియంతృత్వ పోకడలను అనుసరిస్తున్నారని ఆరోపించారు. సాటి ఆదివాసీ అయ్యుండి ఆదివాసీ బిడ్డలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని వాటిని వెంటనే వెనక్కి తీసుకోవడం మంచిదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పొడియం ప్రేమ్ కుమార్, మెచ్చ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జిన్నెలగూడెంలో జన్ సురక్ష భీమా ప్లాన్స్‌పై అవగాహన

**ములకలపల్లి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని జిన్నెలగూడెం గ్రామంలో ఎస్‌బిఐ ఆధ్వర్యంలో జన్ సురక్ష అనే సెంట్రల్ గవర్నమెంట్‌కు సంబంధించిన భీమా ప్లాన్స్‌పై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ములకలపల్లి బ్రాంచ్ ఎస్‌బిఐ మేనేజర్ రవీంద్ర పాల్గొని మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాలు లేని వారికి పిఎం జన్‌ధన్ యోజన క్రింద ఖాతాలు తెరిచి పాస్‌బుక్‌లు ఇచ్చారు. అకౌంట్ తీసుకున్న ప్రతీ ఒక్కరూ, అలాగే ఉన్నవారు కూడా ఈ పిఎం జీవన్ జ్యోతి భీమా యోజన రూ.436లు, అలాగే పిఎం సురక్ష భీమా యోజన కింద ఒక ఏడాదికి రూ.20 చొప్పున 18 నుండి 50ఏళ్ళ లోపు వారు కట్టి వాటి నుండి వచ్చే లబ్ధి పొందాలని తెలిపారు. కావున ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఇన్సూరెన్స్‌లు చేయించుకొని బ్యాంకులలో అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం సెంట్రల్ ఫర్ ఫైనాన్షియల్ కౌన్సిలర్ నవీన్‌బాబు మాట్లాడుతూ భీమా ప్లాన్స్ భార్య, భర్తల ఇద్దరూ చేపించుకోవాలని మీ పిల్లలకు సెక్యూరిటీ ఉంటుందని అన్నారు. భీమా ప్లాన్స్ లేనివారికి భీమా ప్లాన్స్ చేపిస్తామని జన్‌ధన్ యోజన కింద అకౌంట్స్ చేపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, ఆర్‌బిఐ కౌన్సిలర్‌లు, ఇతర సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**కురవి,అక్టోబర్22,ప్రభాతవార్త:**
ఇటీవల అశోక్ లేలాండ్ వాహనం బోల్తాపడి మండలంలోని సూదనపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు నీలం సుధాకర్ తండ్రి నీలం నర్సయ్య ప్రమాదవశాత్తు మరణించగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన నాయనబోయిన పిచ్చమ్మకు షుగర్ వ్యాధి కారణంగా కుడికాలు తొలగించడంతో ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా బలపాల లింగ్యతండాకు చెందిన మాలోతు బిచ్చ కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా అతన్ని పరామర్శించి ఓదార్చారు. లింగ్యతండాలో ఇటీవల లింగానాయక్ తల్లి మరణించడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శలో బజ్జూరి పిచ్చిరెడ్డి, రవినాయక్, రాంలాల్, రమణ, చెన్నారెడ్డి, తదితరులు ఉన్నారు.

## కట్టలేరులో చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

*ఎర్రుపాలెం, అక్టోబర్ 22, (ప్రభాతవార్త):*



చేపల వేటకు వెళ్లి కట్టలేరులో ఓ యువకుడు గల్లంతైన సంఘటన మంగళవారం జరిగింది. మండల పరిధిలోని రాజులదేవరపాడు గ్రామానికి చెందిన గంతాల వెంకటేశ్వర రావు(30) అనే యువకుడు మంగళవారం ఉదయం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కట్టలేరులో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.వెంకటేష్, రెస్క్యూటీమ్‌తో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు వెంకటేశ్వరరావు ఆచూకీ లభించలేదు.

## రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ కమిటీలు వేయాలి...



*చింతకాని అక్టోబర్ 22, (ప్రభాతవార్త) :*

ఇందిరమ్మ కమిటీలను రాజకీయాలకతీతంగా ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సమావేశం వత్సవాయి జానకిరాములు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులను గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయటం ద్వారా నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లుకు లబ్ధిదారుల ఎంపిక కమిటీల ద్వారానే చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ కమిటీ లబ్ధిదారులను రాజకీయాలకు, పార్టీలు అతీతంగా ఎంపిక చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా ఇందిరమ్మ కమిటీని కూడా రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేస్తే లబ్ధిదారుల ఎంపిక కూడా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఎంపికలో పక్షపాతం లేకుండా కమిటీ ఎంపిక చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులకు అన్యాయం జరిగిన అనర్హులకు న్యాయం జరిగిన తమ పార్టీ ఆందోళనకు వెనకాడదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం లాగా జెండా పట్టుకున్న వారికి ఇల్లు ఇస్తామని నిరుపేదలకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విధంగా చేయకుండా పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఉండాలని ఆ తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు రాజకీయాలకు అతీతంగా అందించాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అన్నింటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ స్పష్టంగా హామీ ఇచ్చిందని ఆ హామీ పూర్తిస్థాయిలో అమలు చేయడము లేదన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుతో కదలిన యంత్రాంగం

*చింతకాని అక్టోబర్ 22, (ప్రభాతవార్త) :*



స్థానిక చింతకాని మండల పరిధిలోని గాంధీనగర్ కాలనీలో ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా సోమవారం రోజున గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. జిల్లా అధికారులు తాహశీల్దార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇరువురుని నాలుగు రోజులలో నివేదిక ఇవ్వమని తెలపగా మంగళవారం రోజున తాహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇరువురు సంబంధిత ప్రదేశమును సందర్శించి గ్రామస్తులతో సమస్య పరిష్కారం కోసం మాట్లాడినారు. అందుకుగాను గ్రామస్తులు గ్రామానికి దూరంగా నిర్మించి ప్రజా ఆరోగ్యం కాపాడాలని కోరగా అందుకుగాను సంబంధిత అధికారులు పంచనామా నిర్వహించడం జరిగింది.

## ఘనంగా శ్రీఅభయ నాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



*మధిరరూరల్, అక్టోబర్ 22, (ప్రభాతవార్త):*

మధిరలోని శ్రీవాసవీ కన్యకావరమేశ్వరి అమ్మదేవాలయంలో వేంచేసియున్న శ్రీ అభయ నాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరుగంటల నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలను శ్రీమాన్ శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

## పుల్లమ్మకు నివాళులర్పించిన డాక్టర్ రామనాథం

*మధిరరూరల్, అక్టోబర్ 22, (ప్రభాతవార్త):*



మధిర పట్టణ టీడీపీ శాఖ ఉపాధ్యక్షుడు చిరవంగి ఆశీర్వాదం సతీమణి పుల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. పుల్లమ్మ భౌతిక కాయంపై టీడీపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తెలుగుదేశం పార్టీ కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశీర్వాదం, శ్యామ్‌కుమార్, జ్యోతిలను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం రూ.పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హన్మంతరావు, కార్యదర్శి చెరుకూరి కృష్ణారావు, నాయకులు మేడేపల్లి రాణి, మైనీడి జగన్మోహన్‌రావు, పాశం రామనాథం, చావ్ల సందీప్, యడ్లపల్లి నాగభూషణం, డేనియల్ పాల్, వంకాయలపాటి వెంకటనాగేశ్వరరావు, వీరమాచినేని అశోక్, గూడెల్లి నాగేశ్వరరావు, గట్టిగుండె జయరాజు, చటారి ముసిలి, గద్దల ప్రకాశరావు, సుందర్‌రావు, యేసోబు, చేకూరి బాబూరావు, చటారి ప్రసాద్, వాసిరెడ్డి ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

## నాన్ టీచింగ్ పోస్టులకు ఆహ్వానం

*ముదిగొండ అక్టోబర్ 22, (ప్రభాతవార్త) :*

మండలంలోని న్యూ లక్ష్మీపురం కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు మండల విద్యాశాఖ అధికారి రమణయ్య మంగళవారం విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనలు పురస్కరించుకొని నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయం లక్ష్మీపురం నందు మొత్తం రెండు పోస్టులు, స్వీపర్ కం స్కావెంజర్-1, అసిస్టెంట్ కుక్-1 ఖాళీలకుగాను, దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండి కనీసం వయోపరిమితి 18నుంచి 45 సంవత్సరాల వరకు పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ పోస్టుకు విద్యార్హత ఏడవ తరగతి కింద పరిగణించనున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కస్తూరిబా గురుకుల విద్యాలయం నిర్దేశించిన తేదీలోగా సమర్పించాల్సి ఉంటుంది. జిల్లా ఛైర్మన్ స్థాయిలో ఈ పోస్టులు భర్తీ ప్రక్రియకు కమిటీని నియమించారు. మండల స్థాయిలో తాహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖ అధికారి సెలక్షన్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు మండల వనరుల కేంద్రం ముదిగొండలో దరఖాస్తులు స్వీకరిస్తారు.

## అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు

*బోనకల్, అక్టోబర్ 22, (ప్రభాతవార్త)*

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును మంగళవారం ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణకు రాకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు సివిల్ సప్లై అధికారులు రాంచందర్ రావు, సత్యనారాయణ, కిరణ్‌లు తెలిపారు. చెక్‌పోస్టు ఏర్పాటును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం కావడంతో ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎస్ఐ మధుబాబు, ఆర్ఐ లక్ష్మణ్, ఎఈఓలు రజిత తదితరులు పాల్గొన్నారు.




మధిర, బోనకల్, చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ

## ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్



*మధిరరూరల్, అక్టోబర్ 22, (ప్రభాతవార్త):*

రాష్ట్రంలోని వివిధ డిపోల్లోని ఉద్యోగుల స్పౌజ్(భార్య లేక భర్త) గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌ను ప్రవేశపెట్టగా మంగళవారం మధిర డిపో నందు మేనేజర్ డి.శంకర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం మూడురోజులపాటు కొనసాగుతుందని మేనేజర్ తెలిపారు. ఉద్యోగుల భార్య లేదా భర్త కూడా గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో పాల్గొని వారి ఆరోగ్య పరీక్షలన్నీ కూడా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాణి, సిబ్బంది బీవీ, జీవీరావు, ఎంఆర్‌సీరావు, హెల్త్ వలంటీర్లు ఇస్మాయిల్, సరస్వతీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్య సేవ రికార్డులను నమోదు చేయాలి



*మధిరరూరల్, అక్టోబర్ 22, (ప్రభాతవార్త):*

ఆశ కార్యకర్తలు తమకు కేటాయించిన జనాభా పరిధిలో సంపూర్ణ ఆరోగ్య సేవ రికార్డులను తప్పకుండా నమోదు చేయాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్ సూచించారు. దెందుకూరు పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పనిచేసే పారా మెడికల్ సిబ్బంది, ఆశకార్యకర్తలకు ఇంటింటి ఆరోగ్య సర్వే రికార్డులను మంగళవారం వైద్యాధికారి పృథ్వీరాజ్‌నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సనప గోవిందు, సుబ్బలక్ష్మీ, బి.సరోజినిదేవి, లంకా కొండయ్య, విజయకుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైకేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అన్నదానం

*మధిరరూరల్, అక్టోబర్ 22, (ప్రభాతవార్త):*



మధిర హైకేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం సాయిబాబా దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. హైకేర్ హాస్పిటల్ అధినేత జంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లా డుతూ సాయిబాబా దేవాలయంలో అయ్యప్పస్వాములకు తమవంతుగా అన్నదానం చేయటం సంతోషంగా ఉంద న్నారు. దాత ప్రవీణ్‌రెడ్డిని అయ్యప్పస్వాములు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జంగా నవీన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.




# తహసిల్దార్ అశోక్‌కుమార్ సేవలు అభినందనీయం

## -రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :

భద్రాచలం పట్టణం నుంచి దుమ్ముగూడెం మండలానికి వెళ్ళేందుకు మధ్యలో ఆంధ్రలో కలిసిన కన్నాయిగూడెం, సీతంపేట, చింతలగూడెం తదితర ప్రాంతాల రహదారి మీదుగా వెళ్ళాల్సి ఉండగా ఆంధ్ర రాష్ట్రం పరిధిలోని గుంతలు తీవ్రంగా దెబ్బతినడంతో దుమ్ముగూడెం తహసిల్దార్ మామిడి అశోక్‌కుమార్ తన స్వంత ఖర్చులతో రోడ్డులో ఏర్పడిన గుంతలతో మొరం పోరం మరమ్మత్తులు చేసిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య



మంగళవారం భద్రాచలంలోని తన క్యాంపు కార్యాలయంలో తహసిల్దార్ అశోక్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ ... ఎటువంటి లాభాపేక్ష లేకుండా తన స్వంత ఖర్చులను సైతం వెచ్చించి తన పరిధి కాని ఊరిలో, తనకు సంబంధం లేని రాష్ట్రంలో రోడ్డు మరమ్మత్తులు చేసి రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు గురి కాకుండా చొరవ తీసుకోవడం అశోక్‌కుమార్ మంచిమనస్సుకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాలల మహాపాదయాత్ర కరపత్రం ఆవిష్కరణ

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :



ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 25న జాతీయ మాలమహానాడు, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మాలల మహాపాదయాత్ర కరపత్రాలను మంగళవారం బూర్గంపహాడ్ మండలం మొరంపల్లిబంజర గ్రామంలో జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొజ్జ ప్రసాద్, బర్ల బాబు, సెనగవెంకటేశ్వర్లు, సెనగ బాబు, కుక్కల రామ్మూర్తి, బిల్లా రాము, సెనగ రాంబాబు, పొంది చిట్టిబాబు, శనగ అప్పారావు, బుడిపిటి శ్రీనివాసరావు, కుక్కల వెంకన్న, శనగ వీరకుమార్, పెరుమళ్ళ అజయ్, పిల్లి లాలయ్య, సాంబ, బొజ్జ ప్రవీణ్, వరకా వేణు, రవికిరణ్, సునీల్, మహిళానాయకురాలు పిల్లి ఆదిలక్ష్మి, తుమ్మల పున్నమ్మ, బిల్లా వెంకటరమణ, గొంతెమ్మ, పుట్టి వెంకటరమణ, శనగ నిర్మల, బర్ల నర్సమ్మ, సెనగ సరళ, పుట్టి లావణ్య, బిల్లా నాగవేణి, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

## ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోల మృతదేహాల వివరాలు గుర్తింపు

చర్ల, ప్రభాతవార్త :



ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన గడ్చిరోలి అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగగా.. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు హార్డ్‌కోర్ మావోయిస్టులు మరణించినట్లు పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం ఒక ప్రకటన ద్వారా ధృవీకరించారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి .... మృతుల్లో డీవీసీఎం కంపెనీ నెంబర్ 10కు చెందిన జయ బూరి పద, సావోజీ అలియాస్ అంకాలు, దస్రు, సప్తె టీమ్ తులవీలు ఉన్నట్లు తెలిపారు. వీరిపై చెరొక రూ.16లక్షల రివార్డు ఉన్నట్లు తెలియజేశారు. అదేవిధంగా పీఎం ర్యాంకుకు చెందిన రీట, బసంత్, సుఖమతి ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వీరి తలపై తలా రూ.2లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కాల్పుల స్థలం నుంచి 5 తుపాకీలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు.

## ఘనంగా కొమురం భీమ్ జయంతి

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



దుమ్ముగూడెం తహసిల్దార్ కార్యాలయంలో కొమురం భీమ్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దుమ్ముగూడెం తహసిల్దార్ మామిడి అశోక్‌కుమార్ కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొమురం భీమ్ చూపించిన పోరాట పటిమను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాగులో అక్రమంగా దాచి ఉంచిన కలప పట్టివేత

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



దుమ్ముగూడెం అటవీ రేంజ్ పరిధి పర్ణశాల సెక్షన్ దుమ్ముగూడెం మండలం గౌరారం గ్రామ సమీపంలో గుబ్బలమంగీ వాగులో అక్రమంగా దాచి ఉంచిన టేకు కలపను అటవీ శాఖ అధికారులు మంగళవారం స్వాదీన పరుచుకున్నారు. దుమ్ముగూడెం ఫారెస్టు రేంజ్ అధికారి కమల




ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. గుబ్బలమంగీ వాగులోని అక్రమంగా టేకు దిమ్మలను దాచి ఉంచారనే సమాచారంతో ఫారెస్టు సిబ్బంది గౌరవరం గ్రామ సమీపంలో ఉన్న గుబ్బలమంగీ వాగులో కలప కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నీటిలో దాచి ఉంచిన 9 టేకు దిమ్మలను స్వాధీన పరుచుకుని భద్రాచలం జీటీడీకు తరలించారు. ఈ కార్యక్రమంలో పలువురు అటవీ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అయోడిన్ లోప రుగ్మతుల వారోత్సవ అవగాహన ర్యాలీ

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రపంచ ఆయోడిన్ లోప రుగ్మతుల వారోత్సవ అవగాహన ర్యాలీ మంగళవారం జరిగింది. మండల పరిధిలోని నర్సాపురం, దుమ్ముగూడెం పీహెచ్‌సీల వైద్యసిబ్బంది ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకు జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డా.మధువరణ్ పాల్గొన్నారు. ఈ పీహెచ్‌సీకు వచ్చిన ప్రజలకు ఆయోడిన్ లోపాల వల్ల వచ్చే నష్టాలు, రుగ్మతల గురించి వివరించారు. సాల్ట్‌లో అయోడిన్ పరీక్షలు నిర్వహించి ప్రజలకు చూపించారు. అనంతరం సిబ్బందితో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాష్, దుమ్ముగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి పుల్లారెడ్డి, పలువురు వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళలు జీవనోపాధి పెంపొందించుకోవాలి

### -దుమ్ముగూడెం, చర్ల ఇసుక ర్యాంపులను పరిశీలించిన ఐటిడిఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



గిరిజన మహిళలు స్వంతంగా ఇసుక ర్యాంపులను నిర్వహించుకుని జీవనోపాధిని పెంపొందించుకోవాలని, తద్వారా తమ కుటుంబాలను పోషించుకోవడమే కాక గ్రామంలో ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని భద్రాచలం ఐటిడిఏ పీవో బి.రాహుల్ అన్నారు. దుమ్ముగూడెం మండలంలోని నందులచెలక, చర్ల మండలంలోని వీరాపురం, సి.కత్తిగూడెం, ఎంపీ పల్లి, జి.పీపల్లి, గ్రామాలకు సంబంధించిన ఇసుక ర్యాంపులను పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీ మహిళలతో ఆయన మాట్లాడుతూ ... గిరిజన మహిళలు ఆ గ్రామానికి చెందిన ఇసుక ర్యాంపుల పూర్తి బాధ్యత తీసుకుని సక్రమంగా నిర్వహించి ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. ఇసుక ర్యాంపుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో అశోక్‌కుమార్, డీఎస్ఎండీసీ ఈవో శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :

దుమ్ముగూడెం మండల పరిధిలోని పర్ణశాల గ్రామపంచాయతీలో ఉన్న ముసలమడుగు గ్రామంలో అగ్నిప్రమాదం సంబవించి వాగే సత్యం అనే నిరుపేద వ్యక్తికు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. సర్వం కోల్పోయిన ఆ కుటుంబానికి ముసలమడుగు గ్రామస్తులు స్పందించి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. నగదుతో పాటు వంట పాత్రలు, బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో పర్ణశాల గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ వాగే ఖాదర్‌బాబు, కృష్ణమూర్తి, వాగే రాజేశ్వరి, వాగే పార్వతి, సమ్మయ్య, సత్యనారాయణ, గజేంద్ర, విజయ్, నాగమణి, అశోక్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# దీపావళి ప్రశాంత వాతవారణంలో జరుపుకునేలా పటిష్ట చర్యలు చేపట్టాలి



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ

**దీపావళి టపాసుల షాపుల ఏర్పాట్లు, జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్**

**ఖమ్మం, అక్టోబర్ 22, ప్రభాతవార్త:**

జిల్లా ప్రజలు సురక్షిత, ఆనందమయ దీపావళి జరుపుకునేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో దీపావళి టపాసుల షాపుల ఏర్పాట్లు చేపట్టాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుత ఈనెల 31న జరుపుకునే దీపావళి పండుగకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్థానిక ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో టపాసుల షాపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. షాపుల ఏర్పాటు అనుమతుల మంజూరులో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. అగ్నిమాపకశాఖ ఎన్‌ఓసి, మున్సిపల్ గ్రామ పంచాయతీ అనుమతులు ఉండాలన్నారు. షాపులు ప్రేలుడు రహిత సామాగ్రితో తయారయి ఉండాలన్నారు. షాపు షాపుకు కనీసం 3మీటర్ల దూరం పాటించాలన్నారు. ఎదురెదురుగా షాపుల ఏర్పాటు వుండరాదన్నారు. ఒక క్లస్టర్‌లో 50షాపులకు మించి ఉండకుండా చూడాలన్నారు. నిషేదిత టపాసులు అమ్మకుండా నిఘా పెట్టాలన్నారు. మైదానంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఇసుక, వాటర్ ట్యాంకర్లు, ఫైర్ ఇంజన్లను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ పనుల్లో లూజ్ వైర్లు, అతుకుల వైర్లు లేకుండా చూడాలని, అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలతో వైద్యశిభిరం ఏర్పాటు చేసి, డ్రెస్సింగ్ కిట్స్ అందుబాటులో ఉంచాలని, దీపావళి పండుగ రోజు స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో 24గంటలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రజలు ప్రమాదాలు, ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెం.1077కు కాల్ చేస్తే, అధికారులు స్పందించి, వెంటనే చర్యలు చేపడతారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి, ఎస్పి ఏసిపిసాంబరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.అజయ్‌కుమార్, ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.జకీరుల్లా, జిల్లా వైద్యఆరోగ్య అధికారి డా.వి.సుబ్బారావు, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, షఫీఉల్లా, మధిర వైరా మున్సిపల్ కమీషనర్లు సంపత్‌కుమార్, వేణు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సారు రూటే సపరేటు...

**- ఇష్టమైతే వస్తారు...కష్టమైతే అంతే సంగతి**

**- ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతాడో తెలియని దుస్థితి**

**- రాత్రి వేళల్లో వచ్చి రిజిస్టర్లో సంతకాలు పెడుతున్నట్లు ఆరోపణలు**

**- నెలలో పట్టుమని పది రోజులు వచ్చిన దాఖలాలు లేవు...**

**- దేనిలోనైనా వాటా గుంజి జేబులో వేసుకోవాల్సిందే...**

**- హాజరు కాకపోయినా నెల జీతం ఫుల్‌గా తీసుకుంటున్నట్లు విమర్శలు...**

**- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ప్రధాన ఉపాధ్యాయుని వ్యవహారం...**

మధిర, ప్రభాతవార్త :

సార్‌కి నెలకు జీతం లక్షా డెబ్బైవేలు... అయినాగాని పట్టుమని పది రోజులు కూడా స్కూలుకు రాడు... అలా అని హాజరు పట్టికలో ప్రతిరోజు వస్తున్నట్లే సంతకాలు ఉంటున్నాయి... స్కూలుకు రాకుండా రిజిస్టర్లో సంతకాలు ఎలా ఉంటున్నాయని ఆశ్చర్యపోతున్నారా అలా ఆశ్చర్యపోవాల్సిన అవసరమే లేదు ఎందుకంటే సార్ ఒక్కరోజు వచ్చిన సరిపోయినన్ని రోజులు సంతకాలు పెట్టుకొని వెళ్లిపోతాడు అలా నెలకు సంబంధించిన జీతం మొత్తం తీసుకోవటము ఆయనకు పరిపాటి...అయినాగాని గద్దించేవారు ఆయనకు కాస్‌మేట్ అంట...ఆయన ఎప్పుడూ ఈ సారు జేబులోనే ఉంటాడట... ఈ సారు ఏది చెపితే అదే చేస్తాడట.. ఆ దోరణిలో ధైర్యంగా ఉంటూ నిర్లక్ష్యముగా ఉద్యోగం చేస్తున్నాడు ఏమోగాని నేనే మోనార్క్‌ను అంతా నా ఇష్టమే అనే రీతిలో స్కూల్‌కి వస్తేనే వస్తాడు లేకపోతే అంతే సంగతులు అనే విధాంగా నెలలో పట్టుమని వారం రోజులు కూడా వచ్చిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు అంతేకాకుండా ఏ ఒక్కరోజు వచ్చినా ఆ నెలకు సరిపోను హాజరైనట్లు రిజిస్టర్లలో సంతకాలు పెట్టుకొని యమ దర్జాగా లక్షా డెబ్బైవేలు జీతం తీసుకుంటున్న గాని.. ఆ డబ్బులు సరిపోలేదో ఏమో తెలియదు గానీ ప్రతి దాంట్లో కూడా పర్సంటేజ్ పంపకాలు తీసుకునే దుస్థితి.. ఆలస్యంగా మండలంలో వెలుగులోకి వచ్చింది...వివరాల లోకి వెళ్తే మండల పరిధిలోని జానకిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా శ్రీనివాస్ కుమార్ పనిచేస్తున్నారు. ఈ ప్రధానోపాధ్యా యుడు ఈ స్కూలుకి జాయిన్ అయిన దగ్గర్నించి పట్టుమని నెలకు పది రోజులు వచ్చిన పరిస్థితి లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తు_న్నారు. నిర్లక్ష్యంగా స్కూలుకు రావడమే కాకుండా అసలు ఎప్పుడు వస్తాడో ఎప్పుడు వెళతాడో కూడా తెలియని పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. అంతేకాకుండా ఒకవేళ స్కూలుకు వచ్చిన గాని ఒకవేళ సాయంత్రం మూడున్నర నుంచి నాలుగు గంటల ప్రాంతంలో వస్తారని అలా వచ్చి రిజిస్టర్లో పెండింగ్‌లో ఉన్న సంతకాలను పెట్టుకొని వెళ్తున్నాడని వారు తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ప్రధానోపాధ్యాయుడే నెలలో నాలుగు సార్లు కూడా వచ్చేది లేకుండా పోతే విద్యార్థుల భవిష్యత్తు ఏమైపోతుందో ఏమోనని ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదహారు మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా వీరిలో కనిసం స్కూల్ మొదలై ప్రార్థన గీతం సమయానికి 6 నుంచి 7గురు ఉపాధ్యాయులు మాత్రమే హాజరవుతున్నారు తప్ప ఏ ఒక్కరోజు కూడా ఉపాధ్యాయులు మొత్తం హాజరైన పాపాన పోలేదని ఎవ్వరు కూడా సమయం పాటించడం లేదని ఇష్టం వచ్చిన సమయాలలో ప్రధానోపాధ్యాయుడు బాటలోనే మరికొందరు ఉంటున్నారని వారు వాపోతున్నారు. అంతేకాకుండా ప్రధానోపాధ్యాయుడు ప్రతి దాంట్లో కూడా ఆరు, ఏడు తరగతులు చదువుకుంటున్న విద్యార్థుల నుంచి ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుంచి 120 రూపాయలు చొప్పున వసూలు చేశాడని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. అంతేకాకుండా స్కూల్లో పనిచేసే స్కావెంజర్స్ డబ్బులు కూడా నెలకి రూ.8000 ఇవ్వాల్సి ఉండగా ఆమెకు మాత్రం నీ జీతం రూ.6000 అంటూ రూ.6000 ఇస్తూ మిగిలిన డబ్బులు జేబులు నింపుకుంటున్న దుస్థితి దాపరించిందని పలువురు మండిపడ ుతున్నారు. అంతేకాకుండా ఈ స్కూల్లో 171 మంది విద్యార్థులు చదువుతుం డగా మధ్యా హ్నం భోజనం విషయంలో కూడా సగానికి సగం దోపిడీ జరుగుతుందని వారు తెలిపారు. ఇంత జరుగుతున్న గాని కనీసం విద్యాశాఖ అధి కారులు అలా వచ్చి ఇలా వెళ్తున్నారు తప్ప సద రు ప్రధానోపాధ్యాయుడిని మందలించి గద్దించి చర్యలు తీసుకున్న పాపాన పోలేదని వారు అన్నారు. ఇదే కొనసాగితే విద్యా వ్యవస్థ భ్రష్టు పడుతుందని వారు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇట్టి ప్రధానోపా ధ్యాయుడిపై కొరడా ఝుళిపించి తగు చర్యలు తీసుకోవాలని ముక్త కంఠంతో కోరుతున్నారు.

**విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం...**

**మండల విద్యాశాఖ అధికారి దామల పుల్లయ్య**

జానకిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాస్‌కుమార్ విధులకు హాజరు కావడం లేదని, వారంలో ఏదో వచ్చిన రోజు మొత్తం రిజిష్టర్లలో సంతకాలు పెట్టుకొని వెళ్తాడని అలా నిర్లక్ష్యంగా ఉద్యోగం చేస్తున్నాడని అంతేకాకుండా మధ్యాహ్న భోజనం విషయంలో కూడా అవక తవకలకు పాల్పడుతున్నాడని, స్కావెంజర్స్ డబ్బులు సైతం కోత విధించడం వంటి అంశా లపై మండల విద్యాశాఖ అధికారి దామల పుల్ల య్యను వార్త వివరణ కోరగా ఇట్టి విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చిందని దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.




ఖమ్మం, కార్పొరేషన్, రఘునాధపాలెం, కల్చరల్, ఖమ్మం రూరల్

## అక్టోబర్ 24న దుబాయ్ బైక్ రైడ్ ఎన్రోల్మెంట్ డ్రైవ్

**జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి**

**ఖమ్మం, అక్టోబర్ 22, ప్రభాతవార్త:**

ఈనెల 24న మోడల్ కెరీర్ సెంటర్ గవర్నమెంట్ ఐటిఐ ఖమ్మం నందు దుబ్ బైక్ రైడ్ ఎన్రోల్మెంట్ నిర్వహిస్తున్నట్లు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఇంటర్యూకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాలని జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుబాయ్‌లో బైక్‌రైడర్స్ డెలివరీబాయ్స్‌కి అధిక డిమాండ్ ఉందని ఆకర్షణీయమైన జీతం ప్యాకేజితో ఈ ఉద్యోగాలు ఉంటాయని, సురక్షితమైన, చట్టబద్దమైన వలస మార్గాల ద్వారా అభ్యర్థులకు రిక్రూట్ మెంట్ కొరకు టామ్ కామ్ సహాయం చేస్తుందని తెలిపారు. ఈ ఉద్యో గాలకు అభ్యర్థులు 21 నుండి 40 వయస్సు కలిగి తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండి, కనీసం మూడు సంవత్సరాల ఇండియన్ టూవీలర్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పాస్‌పోర్ట్ తప్పనిసరిగా ఉండాలని, ఏదైనా ఫుడ్ డెలివరీలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, మరిన్ని వివరాల కోసం డబ్ల్యూ.డబ్ల్యూ, డబ్ల్యూ.టామ్ కామ్. తెలంగాణ. గౌట్.ఇన్‌ని, 9440049861. 9440050951, 9440051452 నందు సంప్రదించాలనిఉపాధికల్పనఅధికారిణిఒకప్రకటనలో పేర్కొన్నారు.

## తోటల సంరక్షణపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ అధికారి యం.వి.మధుసూదన్**

**పండ్ల తోటలు, మిరప, ఆయిల్‌ఫామ్ తోటలలో సస్యరక్షణ చర్యలు**

**ఖమ్మం, అక్టోబర్ 22, ప్రభాతవార్త:**

ఖమ్మం జిల్లాలో పండ్లతోటలు, మిరప, ఆయిల్‌ఫామ్ తోటల సంరక్షణపై రైతులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి యం.వి.మధుసూదన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండ్ల తోటలలో మామిడి,జామ, సీతాఫలం, అరటి,నిమ్మ,బొప్పాయి మొదలగు పండ్ల సాగు అంశంలో రైతులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. మిరప పంట సాగు అంశంలో వైరస్ తెగుళ్ల నుంచి పంటను కాపాడుకొని ఎక్కువ దిగుబడులు పొందేందుకు ఉద్యానవన శాఖ అందించిన మెళకువలను పాటించాలని, కొమ్మ ఎండుకాయ కుళ్ళ, తెగులు నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కల ఎదుగుదలకు మంచి సమృద్ధి అయిన పరిమాణంలో సూక్ష్మస్థూల పోషకాలను అందించాలని, కొత్తగా నాటిన ఆయిల్ పంప్ తోటలోని మొక్కలకు మొదటి దఫా ఎరువులను నాటిన మూడు నెలల తర్వాత మాత్రమే వేయాలన్నారు. కాండం తడి తెగులు అనేది ఆయిల్‌ఫామ్ సాగు లో అత్యంత ప్రమాదకరమని, దీని నివారణకు కాండం శస్త్రచికిత్స చేయా లని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఫోన్ ధరను చెల్లించండి

**ఖమ్మం లీగల్, అక్టోబర్ 22, ప్రభాతవార్త:**

డబ్బులు పెట్టి అమెజాన్‌లో ఫోన్‌ని కొంటే ఫోన్ ఇవ్వకుండా ఫిర్యాది మనోవేదనకు నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మంజిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత సభ్యురాలు ఏ.మాధవీలత తీర్పునిచ్చారు. కేసు వివరాలోకెళితే ఖమ్మం పట్టణంకు చెందిన జి.కృష్ణారెడ్డి మార్చి 28,2023 సంవత్సరంలో సెల్‌ఫోన్ అమెజాన్‌లో రూ.29,999/-లకు డబ్బులు చెల్లించి బుక్ చేసుకున్నాడు. ఆసెల్‌ఫోన్‌ను ఏప్రిల్ 5, 2023న ఫిర్యాదికి డెలవరీ అయినట్టు మెసెజ్ వచ్చింది. కాని ఆ ఫోన్ ఇంటికి రాలేదు. ఫిర్యాదుదారుడు ఆన్‌లైన్ కంపెనీకి ఫోన్‌చేయగా వారి నుండి సరైన స్పందన రాకపోవడంతో ఫిర్యాదుదారుడు ఖమ్మంజిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్‌కు నివేదించారు. ఇట్టి కేసును పరిశీలించిన కమీషన్ పిర్యాదుదారుడికి ఫోన్ డబ్బులు రూ.29,999/-లు నష్టపరిహారం క్రింద రూ.10,000/-లు, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.10,000/-లను చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ తీర్పునిచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో పోస్టల్ ఉద్యోగికి గాయాలు

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



దుమ్ముగూడెం సబ్ పోస్టు ఆఫీసు పరిధిలోని పెద్ద కమలాపురం ఏబీపీఎంగా పనిచేస్తున్న బండ్ల చలపతి అనే పోస్టల్ ఉద్యోగి మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలు అయ్యాడు. పోస్టల్ ఉద్యోగి బండ్ల చలపతి ద్విచక్రవాహనంపై పెద్దనల్లబెల్లి గ్రామం వెళ్ళి లక్ష్మీనగరం వస్తుండగా ... ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో అతని తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడు చలపతిని దుమ్ముగూడెం పీహెచ్‌సీకు తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## అయొడిన్ సూక్ష్మ పోషకం అందరికీ అవసరమే

### వైద్యురాలు దుర్గాభవాని

పినపాక, అక్టోబర్ 22, ప్రభాతవార్త



ప్రజలు అయోడిన్ ఉప్పును వాడాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గాభవాని సూచించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలింతలకు, ఆశాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయోడిన్ ఉప్పు వాడకం వల్ల కలిగే లాభాలను, వాడకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అయోడిన్ ఉప్పు వల్ల పిల్లల్లో సరైన పెరుగుదల, సంగ్రహణ శక్తి, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. అయోడిన్ లోప రుగ్మతల బారిన పడ్డవారు రక్త పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి సమతుల్య ఆహారం అవసరమని, అయోడిన్ అనే సూక్ష్మ పోషకం అవశ్యకమైందని తెలిపారు. ఆహారంలో అయోడిన్ లోపం వల్ల గర్భిణీల్లో గర్భస్రావాలు, మాతృశిశు జననాలు, అంగవైకల్యంతో శిశువులు పుట్టడం జరుగుతుందని తెలిపారు. అన్ని కూరగాయాలు, ఆకుకూరల్లో అయోడిన్ సూక్ష్మ పోషకం లభిస్తుందన్నారు. అయోడిన్ ఉప్పు ప్యాకెట్‌పై నవ్వుతున్న సూర్యుడు గుర్తు ఉంటుందని, తయారైన తర్వాత ఆరు నెలల్లో వాడాలని మూత ఉన్న డబ్బాలో మాత్రమే నిల్వ ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన హక్కుల పోరాట యోధుడు కొమరం భీం

### ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల రామకృష్ణ దొర

పినపాక, అక్టోబర్ 22, ప్రభాతవార్త



అడవి బిడ్డల గిరిజన హక్కుల కోసం ప్రాణాలు లెక్కచేయకుండా పోరాటం చేసిన మహోనీయుడు కొమరం భీమ్ అని జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల రామకృష్ణ దొర అన్నారు. కొమరం భీమ్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్డులో గల కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ అంటూ నినదించి ఆదివాసీ జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కొమరం భీమ అని ఆయన ఆశయ సాధనకు ప్రతి గిరిజనుడు కృషి చేయాలన్నారు. నేటి తరం ఆదివాసీ యువతకు ఆయన స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కుర్సం సారయ్య, న్యాయ సలహాదారు ధనసరి నర్సింహా మూర్తి, సభ్యులు ఎట్టి కామేష్, సీనియర్ నాయకులు కాయం సర్వేశ్వరరావు, పాల్గొన్నారు.

## బాధితులకు ఎమ్మెల్యే పాయం పరామర్శ

పినపాక, అక్టోబర్ 22, ప్రభాతవార్త



మండల పరిధిలోని మారేడుగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆరెం ఎల్లయ్య సతీమణి సమ్మక్క మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బాధిత కటుంబాన్ని పరామర్శించారు. సమ్మక్క భౌతికాయంపై పూలమాల వేసి నివాళ్లర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొడిశాల రామనాథం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కూటీని బొలేరో వాహనం ఢీ

### కేసు నమోదు : ఎస్సై చిర్ర రమేష్‌బాబు

నెల్లికుదురు,అక్టోబర్ 22, ప్రభాతవార్త

మండలంలోని ఆలేరు శివారులో ఇద్దరు వ్యక్తులు ప్రయాణీస్తున్న స్కూటీని, బొలేరో వాహనం ఢీ కొట్టగా బొలేరో వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై చిర్ర రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఎస్సై విలేకరులతో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని ఆలేరు స్టేజీకి సమీపంలోని రైతు వేదిక పరసరాల్లో శ్రీ ఇంప్రాటెక్‌కు చెందిన గ్రీన్‌ఫీల్డు హైవేలో పనిచేస్తున్న బొలేరో వాహనం టిఎస్26టిఎ5925 ఆలేరు గ్రామం నుండి ఆలేరు స్టేజి వైపు అతివేగంతో వెళ్తూ,ఆలేరు స్టేజీ నుండి అలేరు గ్రామం వైపు స్కూటీపై వస్తున్న ఆలేరు గ్రామానికి చెందిన కోరే హరీష్ తండ్రి బీరయ్య ఇద్దరు ప్రయాణిస్తుండగా బొలేరో వాహనం వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైయ్యాయి. బీరయ్య పెద్ద కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొలేరో వాహనం డ్రైవర్ జమదగ్నిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎక్సలెన్సీఅవార్డుకు కోమటిపల్లి ఉపాధ్యాయుడు

ఇనుగుర్తి,అక్టోబర్ 22, ప్రభాతవార్త

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శారద ఎడ్యుకేషన్ సొసైటీ,స్మైలైఫ్ ఫౌండేషన్ హైద్రాబాద్ వారు ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ప్రధానం చెసె టీచర్ ఎక్సలెన్సీ అవార్డు 2024కు మండలంలోని కోమటిపల్లి ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయులు ఇల్లందుల నరేందర్ ఎంపికైయ్యారు. మంగళవారం హైద్రాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డు ప్రధాన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహిత కేతావత్ సోములాల్,సైలాభన ఫౌండేషన్ చైర్మెన్ పసుపులేటి నరేంద్రస్వామి చేతుల మీదుగా అవార్డుతోపాటు శాలువాతో సన్మానం ప్రశంశా పత్రాన్ని అందచేశారు. ఉపాధ్యాయునికి అవార్డు పట్ల పాఠశాల ఉపాధ్యాయులతోపాటు ఏపిపిసి చైర్మెన్ కొట్టం చామంతి యాకమూర్తి, మాజీ సర్పంచ్‌లు నీలం యాకయ్య,రావుల మల్లేశం, విద్యాకమిటీ చైర్మెన్ పల్లి వెంకన్న, యాకయ్య,రావుల రమేష్,గ్రామస్తులె తదితరులు అభినందించారు.

## ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

దంతాలపల్లి,అక్టోబర్ 22, ప్రభాతవార్త

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగుచేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎఫ్ఎం కన్సలెంట్ రవి,మండల వ్యవసాయ అధికారిని వాహిని అన్నారు.మంగళవారం మండలంలోని పలు గ్రామాల రైతులకు పొద్దు తిరుగుడు విత్తనాలను పంపిణీ చేసిన అనంతరం గ్రామంలో వేరుశనగ పంట వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో దంతాలపల్లి, బొడ్లాడ, కుమ్మరికుంట్ల,దాట్ల గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

గార్ల, అక్టోబర్22 ప్రభాతవార్త:



ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తు ఎరువుల దుకాణాలు నిర్వహించుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎం. విజయనిర్మల హెచ్చరించారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి కావటి రామారావుతో కలిసి స్థానిక ఎరువుల, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాక్ రిజిష్టర్లను, ఇన్వాయిస్‌లు, ఓపారములను,రిజిస్ట్రేషన్ పత్రాలను, లైసెన్స్ పత్రాలను, స్టాక్ వివరాలను క్షుణ్ణంగా తనిఖీచేసి పరిశీలించారు. రైతులకు ఎరువులు అమ్మితే బిల్లుపై రైతు సంతకం తప్పని సరిఅని, ప్రభుత్వ అనుమతి ఉన్న ఎరువులను మాత్రమే అమ్మాలని, అనుమతి లేని వాటిని, లైసెన్స్‌లో ఓపారం పొందుపరిచిలేని ఎరువులను అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్‌బోర్డు రైతుకు కనిపించే విధంగా షాపులో అమర్చాలని, గడువుదాటిన ఎరువులు, పురుగు మందులను రైతుకు అమ్మజూపితే లైసెన్స్‌లను రద్దు చేస్తామని, ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. రైతులకు ఆధార్‌కార్డు ద్వారా ఈపాస్ మెషిన్ నుంచి ఎరువులు అమ్మాలని, ఈపాస్‌మెషిన్‌లో ఉన్న స్టాక్, గోదాంస్టాక్, రిజిష్టర్‌లో ఉన్న వివరాలతో సరిపోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు ఆమే వెంట ఉన్నారు.

## పిడుగుపాటుతో మహిళకు తీవ్ర గాయాలు

### బందాల పొలాల నుండి అస్వస్థతకు గురైన మహిళలను రోడ్డుకు చేర్చారు

### కొడిసెల క్రాస్ నుండి వాహనంలో ములుగు ఆస్పత్రికి తరలింపు

### క్షతగాత్రురాలికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలి

తాడ్వాయి, అక్టోబర్ 22, ప్రభాతవార్త:

గత రెండు రోజులుగా గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మండలంలో అక్కడక్కడా కురిసింది. ఈ క్రమంలో మండల పరిధిలోని బంధాలకు చెందిన నాలి లక్ష్మీ (38) అనే మహిళా ప్రతి రోజు గ్రామానికి సమీపంలోని మొక్క జొన్న చేనువద్దకు వెళ్లేది. రోజు వెళ్లినట్లుగానే మంగళవారం కూడా వెళ్లింది. కొత్తైవాయి, బీరెల్లి, చైలేడు, లవ్వాల, బంధాల గ్రామాలోల ఉరుములు , మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మొక్క జొన్న చేను వద్ద ఉన్న ఈ మహిళ ఉన్న సమీపంలో ఉన్నట్లుండి పిడుగుపడింది. ఈ సంఘటనలో నాలి లక్ష్మీ పిడుగుపాటుకు గురై స్పృహ కోల్పోయిది. సాయంత్రం అయ్యే సరికి లక్ష్మీ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆరా తీయసాగారు. ఆ చూకీ ఎక్కడ లభించకపోవడంతో మొక్క జొన్న చేను వద్దకు వెళ్లారు. గాయాలతో స్పృహ కోల్పోయి పడి ఉంది. ఆమెను ఇంటి వద్దకు తీసుకెళ్లారు. బంధాల నుండి ద్విచక్రవాహనంపై కొడిసెల క్రాస్ రోడ్డుకు తీసుకొచ్చారు. ప్రధాన రోడ్డు నుండి వాహనంలో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అందించి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా పేద కుటుంబమని తెలిపారు. బాధితురాలికి భర్త, కుమారులు ఉన్నారు. ప్రభుత్వం సహాయం చేస్తేనే మెరుగైన వైద్యం చేయించుకోగలరని తెలిపారు.



## అభయ నేరస్తులను కఠినంగా శిక్షించాలి

ఇల్లెందు అర్బన్, ప్రభాతవార్త: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ అభయపై అత్యాచారానికి పాల్పడి హత్యచేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ఇఫ్టూ భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తోడేటి నాగేశ్వర్‌రావు కొక్కు సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభయ నిందితులను కఠినంగా శిక్షించాలని జూ.డాక్టర్లు చేస్తున్న పోరాటానికి మద్దతుగా జాతీయ కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం ఇఫ్టూ కార్యాలయంలో సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ప్రముఖనగరంలోనే విద్యనభ్యసించే మహిళలకు రక్షణకరువైతే సాధారన నగరాలలో ఉండే మహిళల రక్షణ పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. పశ్చిమ్‌బెంగాల్ ప్రభుత్వం వెంటనే నేరస్తులను కఠినంగా శిక్షించి మహిళల రక్షణకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టాలలో ఉన్న లోసుగులవల్లే నేరస్తులు తప్పించుకుంటున్నారని అలా జరగకుండా ఇలాంటి దుర్మార్గపు నేరాలకు ఒడిగట్టేవారికి కఠిన శిక్షలు విధిస్తే భయం ఉంటుందన్నారు. ఇప్పటికైనా మహిళల రక్షణకు తీసుకొచ్చిన చట్టాలను మరింత బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.మోహన్‌రావు, నూనేశ్వర్‌రావు, రేసు కృష్ణ, జగన్, వేణు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లెందు ఓసీకి ఫైవ్ స్టార్‌రేటింగ్ అవార్డు



ఇల్లెందు అర్బన్, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తితో పాటు ప్రమాదరహిత గనిగా గుర్తించి ప్రతి ఏడాది ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులను అదిస్తారు ఈ అవార్డుకు సింగరేణి ఇల్లెందు ఏరియా జవహర్ ఖని ఉపరితలగని ఎంపిక చేశారు. అందులో భాగంగా ఈ అవార్డను మంగళవారం ఢిల్లీలో ఏరియా జీఎం జాన్ ఆనంద్ అందుకున్నారు. దేశ వ్యాప్తంగా కోల్ ఇండియా, సింగరేణి, ఇతర ప్రయివేటు రంగ 380 సంస్థలు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోగా అందులో సింగరేణి నుంచి రెండు ఉపరితలగనులు ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్నాయి. గతేడాది రెండు భూగర్భ గనులు ఈ అవార్డుకు ఎంపికవ్వగా ఈ ఏడాది ఉపరితలగనులు పూర్తిస్థాయి రక్షణ, ఉత్పత్తిని ప్రదర్శించన నేపథ్యంలో ఈ అవార్డుకు ఎంపికయ్యాయని చెప్పొచ్చు. సింగరేణిలో ఉత్తమ కనబరిచి రక్షణ, ఉత్పత్తి రంగాలలో దూసుకెళ్తున్న గనులకు ప్రోత్సాహకంగా అందించిన ఈ అవార్డులను స్పూర్తితో తీసుకుని ఇతర ఏరియాలు పోటీతత్వంతో ముందుకు సాగాలని అవార్డులను సాధించిన వారిని సంస్థ సీఎండీ ఎన్.బలరాం, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ధర్నా




గుండాల, ప్రభాతవార్త: రైతులు ఆరుగాలం పండించిన పంటలకు సరైన మద్దతు ధరలేక దళారుల చేతుల్లో మోసపుతున్నారని ప్రభుత్వం వెంటనే గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందచేసింది. జిల్లా నాయకులు వెనుగంటి భూషణం అధ్యతన ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉప్పరబోయిన రామ్మూర్తి, సత్యనారాయణ మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర లేక రైతులు తనువుచాలిస్తున్న ఘటనలు రాష్ట్రంలో చూస్తూనే ఉన్నామన్నారు. ఇటు వంటి తరుణంలో రైతుపక్షపాతి పేర్కొంటున్న ప్రభుత్వం రైతుల పంటలకు గిట్టుబాటు ధరలను నిర్ణయించడమే కాకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10నెలలు దాటినప్పటికీ ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలుచేయలేక విఫలమైందన్నారు. రైతు రుణమాఫీ కొందరికే వర్తింప చేశారన్నారు. రైతులకు ఇస్తామన్న బోనస్ ఊసేలేదన్నారు. రూ.2లక్షల రుణమాఫీ కోసం రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తూనే ఉన్నారని ఐనప్పటికీ ఫలితం లేదన్నారు. ఈ మేరకు 13డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్‌కు అందించామన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కందగట్ల సురేందర్, గొగ్గెల పాపారావు, జి.రాంచందర్, బట్టు రవి, కల్తి భద్రయ్య, సుభద్ర, అంజమ్మ, శ్రీను, వెంకన్న, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మంచినీటి సమస్యలు లేకుండా చేయాలి
## ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఇల్లందు, ప్రభాతవార్త, అక్టోబర్ 22: నియోజకవర్గంలోని గ్రామాల్లో మంచి నీటి సమస్య లేకుండా చేయాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లందులోని కొరగుట్ట మిషన్ భగీరథ ఆఫీస్‌లో నిర్వహించిన మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు సహాయకుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు.. గ్రామ స్థాయిలో చిన్న చిన్న సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. మంచినీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు ఈఈతిరుమలేష్, మురళికృష్ణ,ఎంపీడీవో, ఎంపీవో, ఏఈఈ పాల్గొన్నారు.

### సోలార్ కార్మికులకు లాభాల బోనస్ రూ.5వేలు చెల్లించాలి




ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు చెల్లిస్తున్న రూ.5వేల బోనస్‌ను సోలార్ పవర్‌ప్లాంట్ కార్మికులకు చెల్లించాలని సిఐటీయూ మండల కార్యదర్శి తాళ్లూరి కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పవర్‌ప్లాంట్ ఎదుట కార్మికులతో పాటు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం ఎస్టోటూ జీఎం, డీజీఎం పర్సనల్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ నిర్వహించే సోలార్ పవర్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులతో పాటుగా సోలార్ కాంట్రాక్టర్లుగా ఉన్న ఖేల్, సోలారిస్ యాజమాన్యానికి సమస్యను వివరించినట్లు తెలిపారు. పై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.ప్రేమ్‌సింగ్, ఎం.శంకర్, శ్యాంబాబు, చందర్, బాలు, హీరా, శ్రావన్, పాల్గొన్నారు.

## ఘనంగా కొమురంభీం జయంతి



ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త: అడవి బిడ్డల ఢీంకార స్వరం కొమురంభీం జయంతి వేడుకలను ఇల్లెందులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఫౌండర్ దిండిగాల రాజేందర్ పలువురు నాయకులు కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ కొమురం భీం అడవిబిడ్డలు పడుతున్న అవస్థలను చూడలేక అతి పిన్నవయస్సులోనే వారి తరవున పోరాడిన మహా యోధుడని వివరించారు. స్వతంత్ర్యం రాకముందే పోరాట పటిమతో అడవిబిడ్డగా జల్‌జంగిల్ జమీన్ నినాదంతో పోరుబాటపట్టిన ధీరుడని వర్ణించారు. అడవి బిడ్డలు పడుతున్న ప్రతి కష్టాన్ని కళ్లారా చూసి వాటి పరిష్కారానికి కృషి చేసిన గొప్పమహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్‌రావు, బావుసింగ్, నెమలి ధనలక్ష్మి, అబ్దుల్ నభి, గిన్నారపు రాజేష్, సాతల హరికృష్ణ, రాచపల్లి శ్రీను, దేరంగుల పోశం, ఆదూరి రవి, కాసాని హరిప్రసాద్, చాంద్‌పాషా, కడగంచి వీరస్వామి, లలిత్‌పాసి, వసంతరావు, సన రాజేష్, రాంలాల్, బాబా, పాలడుగు రాజశేఖర్, నిఖిల్, కొక్కు సరిత పాల్గొన్నారు.




## ఇల్లెందు, గుండాల, టేకులపల్లి

### కేవోసీలోని ఎల్ఎస్ఎన్ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి

టేకులపల్లి, ప్రభాతవార్త, అక్టోబర్ 22:



మండలంలోని కోయ గూడెం ఉపరితలగని ఓబీలో పనిచేస్తున్న ఎల్ ఎస్ఎన్ కంపెనీ కార్మికులకు ఐదువేలు ఇవ్వలేదని, సేఫ్టీ వసతులు కల్పించకుండా జీతాలు సమయానికి ఇవ్వట్లేదని టేకులపల్లి జేఏసీ నాయకులు లక్కినేని సురేందర్‌రావు, సభ్యులు డీ ప్రసాద్, ధర్మపురి వీరబ్రహ్మాచారి, మాలోత్ శివ అన్నారు. ఈ మేరకు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సింగరేణీ హెడ్ ఆఫీస్‌లో జీఎం పర్సనల్ పీపీ, డైరెక్టర్ పీఏకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కోయగూడెం ఓసీలోని ఓబీ పనులు చేస్తున్న ఎల్ఎస్ఎన్ కంపెనీ కార్మికులకు సరైన సమయానికి జీతాలు ఇవ్వట్లేదని, అడిగిన కార్మికులను డ్యూటీ నుంచి ఆపుతూ వేధింపులకు గురి చేస్తుందన్నారు.కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించలేదని, ఎల్ఎస్ఎన్ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు.కోయగూడెం ఓసీలో 350 మంది పైగా కార్మికులు పనిచేస్తుంటే 160 మందికి మాత్రమే బోనస్‌లు ఇచ్చారని మిగతా వారికి ఇవ్వలేదని అన్నారు. కార్మికులకు విశ్రాంతి గదికూడా లేదని, కార్మికులు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో బోనస్ విషయంలో నిలదీస్తే కార్మికులను డ్యూటీ ఆపిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. కార్మికుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న ఎల్ఎస్ఎన్ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కోరారు.

## టిప్పర్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ



టేకులపల్లి, ప్రభాతవార్త, అక్టోబర్ 22: టేకులపల్లి మండలంలోని టిప్పర్ కార్మికుల వేతనాలు సమస్యలను పరిష్కారించాలని సమ్మెను నిర్వహించారు.మంగళవారం టీయూసీఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, మోటర్ వర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, అనుబంధ సంస్థ టీయూసీఐ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టిప్పర్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వేతనాలు పెంపు కోరకు టిప్పర్ యాజమాన్యలు ఈ నెల 28న చర్చలు జరుపుతామని తెలిపారని అన్నారు. టిప్పర్ డ్రైవర్ల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామని తెలిపారు. ఈ నెల 28న చర్చలు సఫలం కాకపోతే తిరిగి సమ్మెను నిర్వహిస్తామని అన్నారు. ఈ చర్చలలో టిప్పర్ అసోసియేషన్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కోరం సురేందర్, అధ్యక్షులు నరసింహారావు, కోల్ ట్రాన్స్‌పోర్ట్ అధ్యక్షులు వరద రామ చంద్రయ్య, టీయూసిఐ టేకులపల్లి మండల కార్యదర్శి జర్పుల సుందర్, టేకులపల్లి బ్రాంచ్ కార్యదర్శి మదార్, చింటూ, రాజేష్, చంటి, రమేష్‌బాబు, నరసింహారావు, సురేష్ పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇల్లెందు, ప్రభాతవార్త: నేడు టేకులపల్లి, ఇల్లెందు మండలాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన చేయనున్నారు. బుధవారం ఉదయం 9గంటలకు టేకులపల్లి మండలంలోని గొల్లతండాలో సీసీరోడ్డు, ఇల్లెందు మండలం మామిడిగూడెంలో 10గంటలకు బీటీ రోడ్డు, శ్రాబీకల్వర్టు నిర్మాణ పనులకు చట్లసముద్రం, రేపల్లెవాడ గ్రామాలలో శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 1గంటకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు.

## దళిత, గిరిజనుల ఆశాజ్యోతి ఎస్.ఆర్ శంకరన్

**-గిరిజన సామాజిక చైతన్య వేధిక అధ్యక్షులు కిషన్‌నాయక్**

*మహబూబాబాద్ నెహ్రూసెంటర్,అక్టోబర్22,ప్రభాతవార్త:*



దళిత, గిరిజన, పిడిత ప్రజల ఆశాజ్యోతి ఎస్.ఆర్ శంకరన్ అని గిరిజన సామాజిక చైతన్య వేధిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. ఎస్.ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కిషన్‌నాయక్ మాట్లాడుతూ తమిళనాడులో జన్మించిన ఎస్.ఆర్ శంకరన్ ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో సబ్‌కలెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు అనేక విదులు నిర్వహించి తన వృత్తిలో నిబద్ధతతో పనిచేసి దళిత, గిరిజన, బహుజన పీడిత వర్గాల కోసం అనునిత్యం తపిస్తుండేవారన్నారు. దళిత, గిరిజనుల కోసం సాంఘిక సంక్షేమ గురుకులాలను స్థాపించడంలో క్రీయాశీలకంగా వ్యవహరించారన్నారు. నేడు అనేక మంది కిందవర్గాల ప్రజలు చదువుకొని అనేక రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. నేటి అధికారులు శంకరన్ లాంటి అధికారులను ఆదర్శంగా తీసుకొని ప్రజల కోసం పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దుడ్డెల రామ్మూర్తి, సత్యనారాయణ, శ్రీధర్, భాగ్యమ్మ, రాంచందర్, మోహన్‌నాయక్, ఆనంద్, సురేష్, గణేష్, నాగరాజు, నరేష్, నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మిర్చిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

**-కెవికె మల్యాల శాస్త్రవేత్తలు మాలతి, కాంత్రికుమార్**

*బయ్యారం,అక్టోబర్22,ప్రభాతవార్త:*



రైతులు మిర్చిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని కెవికె మల్యాల శాస్త్రవేత్తలు మాలతి, కె.క్రాంతికుమార్‌లు సూచించారు. క్షేత్రపర్యటనలో భాగంగా మంగళవారం మండలంలోని సింగారం గ్రామంలో గంగావతి రాంబాబు మిర్చితోటను, భీముడు మొక్కజోన్న పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మిర్చితోటలో వచ్చే నల్లి, కింద ముడత, పైముడత, మసిపేను నివారణకు ఏప ఫెస్టిసైడ్స్ వాడాలో రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాంజి, వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు, రైతులు బానోత్ శ్రీను, గంగావత్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళపై దాడి

*కామేపల్లి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:*





ఒంటరి మహిళపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన కామేపల్లి మండలం బాసిత్‌నగర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఎస్సై బి.సాయికుమార్ కథనం మేరకు ఇలా ఉన్నాయి. బానోత్ రేణుక భర్త గత 12ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో తనకు ఉన్న 2ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ తన ఇద్దరు ఆడబిడ్డలను చదివించుకుంటోంది. ఆమె 2 ఎకరాల భూమిపై భర్త అన్న కన్ను పడింది. ఈ నేపథ్యంలో తనను అతను లైంగికంగా వేధిస్తున్నాడని, అత్తమామలతో కలిసి దాడి చేసి గాయపర్చారని, వారి నుండి తనకు ప్రాణహాని కూడా ఉందని వాపోతూ స్థానిక పోలీసు స్టేషన్‌లోరేణుక లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం వైద్యశాలకు పంపించి ఆమె ఫిర్యాదు మేరకు వేధింపులు, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సాయికుమార్ తెలిపారు.

## అనుమతులు లేని భవనాలు కూల్చివేయండి

## పంచాయతీ కార్యాలయంలో టిడిపి వినతి

*అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:*



మండలంలోని వినాయకపురం మెయిన్‌రోడ్లలో అనుమతులు లేకుండా కట్టిన భవనాలను వెంటనే కూల్చాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నార్లపాటి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళవారం వినాయకపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వినాయకపురం ప్రధాన రోడ్( అశ్వారావుపేట నుండి భద్రాచలం)కు ఇరువైపులా అనుమతులు లేకుండా కట్టిన భవనాలను కూల్చీలని, ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

## గంజాయి, డ్రగ్స్ నిర్మూలణపై ప్రత్యేక చర్యలు

### పిల్లల నడవడికను తల్లిదండ్రులకు పర్యవేక్షించాలి

### డ్రగ్స్, గంజాయి అవగాహనపై సీపి సునీల్‌దత్

*సత్తుపల్లి,అక్టోబర్ 22, ప్రభాతవార్త:*




రాష్ట్ర ప్రభుత్వ నిషేధిత గంజాయి, మత్తు పదార్ధాలపై అక్రమ రవాణా మరియు క్రయ, విక్రయాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలపాలాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, డ్రగ్స్, గంజాయి పై ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. కల్లూరు డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో స త్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కల్లూరు ఏసిపి అనిశెట్టి రఘు, పట్టణ సీఐ టి. కిరణ్‌ల నేతృత్వంలో గంజాయి, మత్తు పదార్ధాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఖమ్మం సీపి సునీల్ దత్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే యువత ఈ మత్తు పదార్ధాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవచ్చని యువతకు సూచించారు. సత్తుపల్లి మండలం ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో ఉండటం వల్ల తరచుగా గంజాయి, మత్తు పదదార్ధాల రవాణాకు కేంద్రంగా మారిందని, ఈ గంజాయి మత్తు పదర్ధారాలు రవాణా చేసే వారిపై పోలీసులు గట్టి నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ సునీల్ దత్ హెచ్చరించారు. మత్తు పదార్ధాలు వినియోగించే పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షిస్తూ వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారిని మందలిస్తూ మంచి వార్గంలో నడిచేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇటీవల గంజాయి సేవించే యువతను 94 మందిని పట్టుకోవడం జరిగిందని వారికి సమాజంలో మంచి పౌరులుగా మారేందుకు ఒక అవకాశం ఇవ్వడం జరిగిందని, వారి ప్రవర్తనను కూడా పోలీస్ శాఖ పర్యవేక్షిస్తుందని అన్నారు. యువత సమాజంలో ఉన్నత లక్ష్యాలతో మంచి పౌరులుగా రాణించాలని, సమాజంలో మీడియా మిత్రులతో పాటు ప్రతి పౌరుడు గంజాయి, మత్తు పదర్ధాల నియంత్రణకు ప్రతి ఒక్కరి బాధ్యతగా పోలీస్ శాఖకు సహకరించాలని సునీల్ దత్ కోరారు. యువత గంజాయి, మత్తు పదార్ధాలకు బానిస కావడం వల్ల ఈ మత్తు పదర్ధాలు మెదడు, నాడీ వ్యవస్థపై పని చేయడంతో గంజాయి సేవించిన వారు విచక్షణ కోల్పోయి ప్రవర్తించడం జరుగుతుందని కల్లూరు ఏసిపి అనిశెట్టి రఘు అన్నారు. అనంతరం స్థానిక పోలీసుల నుండి సీపీ గౌరవ వందనం స్వీకరించి పోలీస్ స్టేషన్‌లో వివిధ రికార్డులను పరిశీలించి క్రైమ్ వివరాలను సిపి అడిగి తెలుసుకున్నారు. ముందుగా సీపికి ఎసిపి ఎ. రఘు, సిఐ టి. కిరణ్‌లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు . అనంతరం స్టేషన్ ఆవరణలో సీపీ మొక్కలు నాటారు. ఈ సదస్సులో రూరల్ సిఐ ముత్తులింగం, కల్లూరు, పెనబల్లి, వేంసూరు, తల్లాడ మండలాలకు చెందిన ఎస్ఐలు షాకీర్, వెంకటేశం, మేడా ప్రసాద్, ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి,

సిబ్బంది చెన్నారావు, నరేష్, ప్రకాష్, రమేష్, రామకృష్ణ; శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.




**అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి**

## కల్వర్టు మరమ్మత్తులపై నిర్లక్ష్య మేల ?

*దమ్మపేట,ఏజెన్సీ,అక్టోబర్,22,ప్రభాతవార్త*



;మండల పరిధీలోని గణేష్‌పాడు ,సీతారంపురం గ్రామానికి వెళ్ళె ప్రధాన మార్గం పై గత సంవత్సరం క్రితం భారీ తుఫాన్‌కు కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గం గుండా వాహనాదారులు, ట్రాక్టర్లపై రైతులు చేలో పనుల నిమిత్తం నిత్య ప్రయాణిస్తుంటారు. రోడ్డు మండల కేద్రానికి అనుసంధానమై ఉంది. దీనితో ఈ మార్గం గుండానే నిత్యం మండల కేంద్రానికి వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కల్వర్టుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు. ఈమధ్యకాలంలో వచ్చిన తుఫాన్ వల్ల వచ్చిన భారీ వరదకు మరోసారి కల్వర్టు పూర్తీగా దెబ్బతింది. ఈరోడ్డు మార్గాన రాత్రి సమయల్లో ప్రయాణించాలంటే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవవాశం లేకపోలేదు. దీనితో ఈమార్గం గుండా ప్రయాణించాలంటే ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆధికారులు కల్వర్ట్ వరదలకు కొట్టుకునిపోయి సంవత్సర కాలం గడుస్తున్న ఎటువంటి మరమ్మత్తులు చర్యలు చేపట్టలేదని అసలు ఆర్ అండ్ బి ఆధికారులు ఉన్నారో, లేదో తెలియని పరిస్థితులు ఉన్నాయని తక్షణమే ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సంబంధిత ఆధికారులతో మాట్లాడి వెంటనే కల్వర్ట్ మరమ్మత్తులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## అంతర్జాతీయ డ్రోన్ సమ్మిట్‌లో పాల్గొన్న తుమ్మల యుగంధర్



*దమ్మపేట, అక్టోబర్ 22 ప్రభాతవార్త:*

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జరుగుతున్న అంతర్జాతీయ డ్రోన్ సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావు తనయుడు తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు. ఆహ్వాన కమిటి వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్‌మోహన్‌నాయుడుతో కలిసి డ్రోన్ సమ్మిట్‌లో తుమ్మల యుగంధర్ పాల్గొన్నారు. ఈ డ్రోన్‌సమ్మిట్‌లో కేంద్ర మంత్రి రామ్‌మోహన్‌నాయుడును కలిసి వ్యవసాయ రంగంలో డ్రోన్‌వాడకంపై విస్త్రతంగా చర్చలు జరిపారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి ఇరురాష్ట్రాలను డ్రోన్‌హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఎపి కృషిచేయడం జరుగుతుదని అన్నారు. ఇందుకోసమై రాష్ట్ర రాజధాని అమరావతిలో, మంగళగిరి సికె కన్వెన్షన్‌లో దేశంలో మొట్టమొదటి సారి 5500ల డ్రోన్‌లతో అంతర్జాతీయ డ్రోన్ సమ్మిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల సమాయ సహకారాలతో తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషిచేస్తామని అన్నారు.

## యునైటెడ్ కింగ్ డమ్ గోర్ బంజారా అసోసియేషన్ దాతృత్వం

కామేపల్లి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):



యునైటెడ్ కింగ్ డమ్ గోర్ బంజారా అసోసియేషన్ దాతృత్వాన్ని చాటుకుంది. కామేపల్లిన్ల ఎస్సై బి.సాయికుమార్ చేతుల మీదుగా రూ.40వేల చెక్కును అందజేశారు. సింగరేణి మండలం వెంకిటియా తండాకు చెందిన గుగులోత్ హరికిషన్ ఉన్నత చదువులకై లండన్‌కి వెళ్ళాడు. అక్కడ చదువుకోవటానికి ఆర్థిక ఇబ్బందులతో పాటు తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడంతో అక్కడ నుండి వెనుతిరిగి ఇంటికి వచ్చాడు. తల్లికి ఆస్పత్రి ఖర్చులు కూడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో తన గోడును యునైటెడ్ కింగ్ డమ్ గోర్ బంజారా అసోసియేషన్‌కు విన్నవించుకున్నారు. గుగులోత్ రవీందర్ సారధ్యంలో రూ.40వేలను ఎస్సై సాయికుమార్ చేతుల మీదుగా హరికిషన్‌కు అందించారు. దీంతో అసోసియేషన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి డబ్బులతో తన తల్లి ఆస్పత్రి ఖర్చులతో పాటు జీవనం కొరకు చేపల పెంపకం నిమిత్తం మోటారు కొనుగోలుకు వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్‌లు గుగులోతు రమేష్, ధరావత్ అంజయ్య, గుగులోత్ సీతారాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు



కారేపల్లి, అక్టోబర్ 22, (ప్రభాతవార్త):

ప్రజా ఉద్యమాలతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవచ్చని ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉసిరికాయలపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.... ప్రజా సంక్షేమాన్ని మరవి మతతత్వ పోకడలతో ప్రజల మధ్య ఉద్రిక్తలు పెంచుతుందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యుడు సతమతమవుతూ మోడీ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత వస్తుందన్నారు. దాని నుండి దారి మళ్లించటానికి బీజేపి మతరాజకీయాలను రాజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జాప్యంతో లబ్ధిదారులలో అసహనం పెరుగుతుందన్నారు. వెంటనే రైతు భరోసా, రుణమాఫీపై స్పష్టమైన ప్రకటనలు రాక రైతులు పెట్టుబడుల కోసం అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే రైతు భరోసా వేయాలని, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఫించన్ల పైకం పెంపు మహిళలకు రూ. 2500లు, ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు ఇప్పటికే గ్రామ శాఖ అయ్యాయని, మండల మహాసభలు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 9,10వ తేదీలలో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు సంబంధించి ఈ నెల 25న సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేధావులు, ప్రజా సంఘాల నాయకులను ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కే నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, సర్పంచ్ బానోత్ బన్సీలాల్, నాయకులు తేజావత్ చందర్, సైదులు, బన్సీ, బాలు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వినోద్‌కుమార్‌కు ఘనంగా సన్మానం

వైరా, అక్టోబర్22,(ప్రభాతవార్త):

వైరా మండలం శాంతినగర్‌కు చెందిన కాకాటి వినోద్‌కుమార్‌ని ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హైదరాబాద్‌లో జరిగిన తీన్మార్ మల్లన్న టీం ఆత్మీయ సమయంలో కాకాటి వినోద్‌కుమార్‌ని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఘనంగా సన్మానించారు. మల్లన్న మాట్లాడుతూ 2019 20 నుండి ఇప్పటివరకు తన వెంటే ఉంటూ తన గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన కాకాటి వినోద్‌కుమార్‌ని సన్మానించడం చాలా ఆనందంగా ఉందని, ఏదైనా పనిచేసే తక్షణమే నెరవేర్చి కరోనా సమయంలో కూడా ఎంతో మందికి ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు, భోజనాలు పంపిణీ చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు వార్తలు వ్రాస్తూ గత ప్రభుత్వాన్ని నిలదీసిన వ్యక్తి వినోద్‌కుమార్ అని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెద్దప్రోలు కోటేశ్వరరావు, బొర్రా ప్రశాంత్, ప్రకాష్, సింగర్‌రవి, శివ పాల్గొన్నారు.

## గ్రామాల్లో పర్యటించిన శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులు



కారేపల్లి,అక్టోబర్ 22, (ప్రభాతవార్త):

వివిధ శాఖల పనితీరు సమీక్ష అంశాలను తెలుసుకునే క్రమంలో సింగరేణి మండలంలో పలు గ్రామాల్లో నెలకొన్న స్థితిగతులపై ట్రైనీ ఐఏఎస్ అధికారులు అలియాతండాలో 5రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఐకెపి మహిళా సంఘాలతో సమావేశమైయ్యారు. ఈ సమావేశంలో మహిళా సంఘాలకు మంజూరు చేయబడిన లోన్లు, వాటి రికవరీ వివరాలను, ఆ లోన్ల ద్వారా మహిళా సంఘాలు ఉపయోగించుకున్న విధి విధానాలను సంబంధిత సీసీల ఆధ్వర్యంలో అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. మహిళా సంఘాలకు రుణాలు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో సమగ్ర వివరాలను ఈ పరిశీలన ద్వారా అధ్యాయనం చేశారు. దీంతో పాటు అంగన్వాడీ ప్రాథమిక పాఠశాలను సైతం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, ఏపీవో, ఐకెపి, సీసీలు, మహిళా మండలి సభ్యులు, వీవోలు, పంచాయితీ కార్యదర్శి నెహ్రూ, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం....



కారేపల్లి,అక్టోబర్ 22, (ప్రభాతవార్త):

గతంలో ఆలయ అభివృద్ధికి కృషి చేశామని, పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తురక నారాయణ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ఎమ్మెల్యేని కలిశారు. పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి సహకారం కావాలని, ప్రభుత్వ పరంగా పెద్దమ్మతల్లి ఆలయానికి రావాల్సిన దీప, దూప, నైవేధ్యం కింద నిధులు మంజూరు చేయవల్సిందిగా కోరారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసే నిధులు మంజూరయ్యే విధంగా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, యాకయ్య, సీతారాములు, సక్రు, నాగేశ్వరరావు, మల్లయ్య, యాకూబ్ అలీ, తురక నారాయణ, శ్రీను, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు మరమ్మత్తులు మైనార్టీ నేత యాకూబ్ అలీ



కారేపల్లి, అక్టోబర్ 22,, (ప్రభాతవార్త):

మండల కేంద్రమైన కారేపల్లి గ్రామ పంచాయితీ 5వ వార్డు గల సీసీ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకి కంకర లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు పాదాచారులకు ప్రమాదకరంగా మారింది. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సూచన మేరకు మైనార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి యాకూబ్ అలీ మంగళవారం చేయించారు. దీంతో స్థానికులు పాదచారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానికులు బండేలీ భాను, అమ్మనని బోళ్ళ మన్సూర్ సహకరించారు.




### కారేపల్లి, వైరా, కొణిజర్ల, ఏన్కూరు

## ఎస్సీ స్మశాన వాటికకు మోక్షం



కారేపల్లి, అక్టోబర్ 22, (ప్రభాతవార్త):

ఎస్సీ స్మశాన వాటికకు శాశ్వత రహదారి నిర్మాణానికై మేదరి టోనీ స్థానిక నాయకులతో కలిసి కొలతలను చేపట్టారు. మండల కేంద్రంలోని ఎస్సీ స్మశాన వాటికకు వెళ్ళు దారి ఇబ్బందికరంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యను ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మేదరి టోనీ వైరా శాసన సభ్యులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను కలిసి స్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలని కోరగా సముఖంగా స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం మంగళవారం స్థానిక నాయకులతో కలిసి రహదారి కొలతలను అంచనా వేసారు. ఈ కార్యక్రమంలో ఎండి హనీఫ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీం జయంతి వేడుకలు




కారేపల్లి, అక్టోబర్ 22,, (ప్రభాతవార్త):

రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో కొమరం భీం జయంతి వేడుకలకు మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఏటీడీవో జహిరుద్దీన్ కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆదివాసీ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి అమరుడైన ఆదివాసీ యోధుడు కొమరం భీం అన్నారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో గిరిపుత్రుల హక్కుల కోసం సాయుధ పోరాటం చేసిన యోధుడని నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన సాయుధ యోధుడు కొమరం భీం అని కొనియాడారు. జయంతి వేడుకలను మంగళవారం రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులతో కొమరం భీం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ మాస్టర్ ఎల్ రాములు, డిప్యూటీ వార్డెన్ జజి సక్రం, డి వెంకటేశ్వర్లు, డి వీరన్న, డి తార, ఎం రాంబాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, జి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## 50 కుటుంబాలకు చీరల పంపిణీ

కారేపల్లి,అక్టోబర్ 22, (ప్రభాతవార్త):



కారేపల్లి గ్రామ పంచాయితీలో 50 నిరుపేద కుటుంబాలకు దీపావళి పండుగ సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా వైనారిటీ నాయకులు గౌసుద్దీన్ అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబాలలో సంతోషాన్ని చూడాలని పేదలకు తన వంతు సహకారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమందల రాములు, కలిముల్లా ఖాన్, ముఠామేస్త్రి కొప్పుల వెంకటమ్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మెట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సత్తుపల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త:

సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌వద్ద వేంచేసి యున్న శ్రీ మెట్ట ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కాలినేని కాంతారావు, మల్లూరు అంకం రాజుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తుపల్లి పట్టణంతో పాటు ఎన్టీఆర్‌నగర్, రాజీవ్‌నగర్, రేజర్ల తదితర చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరై భజనా కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. గొర్లమారి సంజీవరెడ్డి, అరుణ కుమారి , మైపాల్ రెడ్డి గార్ల అల్లుడు సౌజన్య, అభిషేక్ రెడ్డిలు ముందుకు వచ్చి మహా అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సాయం అందజేశారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు చింతలపాటి సత్యనారాయణ, మందపాటి రవీందర్ రెడ్డి తదితరులు హాజరైనారు.

## కబరస్థాన్‌కు స్థలాన్ని కేటాయించండి

### ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసిన ముస్లీంలు



సత్తుపల్లి,అక్టోబర్ 22, ప్రభాతవార్త:

సత్తుపల్లి పట్టణంలోని వేంసూరు రోడ్డులో కబరస్థాన్ ( సైదులు దర్గా) స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే డా. మట్టా రాఘమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి, ఎండి కమల్‌పాషాలతో పాటు మరి కొందరు ముస్లీంలు కలిసి కలెక్టర్ ముజ్మల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా పట్టణంలోని వేంసూరు రోడ్డులో షాదీఖానా పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో ముస్లీంలు కలెక్టర్‌కు వినతిపత్రంలో సమర్పించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యను త్వరితగతిన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే దంపతులకు, ముస్లీంలకు ఆయన హామీ ఇచ్చారు.

## ఆర్టీసి బస్టాండ్ షాపులకు టెండర్ల ఆహ్వానం

సత్తుపల్లి,అక్టోబర్ 22, ప్రభాతవార్త:



సత్తుపల్లి డిపో పరిధిలోని సత్తుపల్లి, వీఎం బంజర్, అశ్వారావుపేట బస్టాండ్‌లో ఉన్న కమర్షియల్ షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మీ మంగళవారం పత్రికలకు తెలిపారు. పై మూడు బస్టాండ్‌లలో 21 షాపులకు గాను నేటి నుండి నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె కోరుతున్నారు. సత్తుపల్లి బస్టాండ్‌లో 13 షాపులకు (ఎ క్లాస్ ), అశ్వారావుపేటలో 4 షాపులు (బిక్లాస్), వీఎం బంజర్‌లో 4 షాపులు ( బిక్లాస్)కు మాన్యువల్ అప్లికేషన్ ఆఫీసు పని వేళల్లో ఆఫీస్ సూపరింటెండెంట్‌కు సమర్పించాలని డిఎం కోరారు. మరిన్ని వివరాలకు 9963507506, 9866619189 నెంబర్లను సంప్రదించాలని డిపో మేనేజర్ రాజ్యలక్ష్మీ కోరారు.

## పశువైద్యశాలలోకి దారేది..?



పెనుబల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త

పెనుబల్లి మండల కేంద్రంలోని మండల పశువైద్యశాలలోకి వెళ్ళేందుకు దారి లేకపోవడంతో వైద్య సిబ్బంది, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం వందలాది మంది రైతులు తమ పశువులను తీసుకుని అనేక సూచనలు, సలహాల కోసం మండల పశువైద్యశాల అధికారులను సంప్రదించడానికి పశువైద్యశాలకు వస్తుంటారు. మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం.. ఇలా మండల ప్రధాన కార్యాలయాలన్నింటికి కూతవేటు దూరంలో ఉన్న పశువైద్యశాల ప్రధాన ద్వారం దగ్గర నుండి పశువైద్యశాల వరకు నిత్యం బురద నీళ్ళతో బురదమయంగా ఉండటంతో అనేక అవస్థలకు గురవుతున్నారు. రైతాంగానికి సేవలందించే ప్రాధాన్యతా అంశాలలో ఒకటైన పశువైద్యశాలకు ఎన్నో ఏళ్ళుగా ఇటువంటి దుర్భర స్థితిలో ఉన్న పట్టించుకున్న నాయకులు గాని, అధికారులు గాని లేకపోవడం గమనార్హం. కోట్లాది రూపాయలు వెచ్చించి, అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగానికి పశువైద్యశాలలోని దుస్థితి కానరాకపోవడం బాధాకరం. మండల పశువైద్యాధికారి, మహిళా అధికారి సర్కస్ ఫీట్లు చేస్తూ పశువైద్యశాలలోకి వెళ్ళాల్సిన పరిస్థితి. పశువులతో వచ్చే ముసలి, ముక్క పేద రైతులు పలు సార్లు ఆ నీటి గుంటల్లో కాలుజారీ పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం పశువైద్యశాల దుస్థితిని పరిశీలించి, వైద్యశాలలోకి వెళ్ళేందుకు దారిని బాగుచేయాలని మండల రైతాంగం కోరుకుంటోంది.

## మండలంలో బ్రహ్మశ్రీ తాళ్ళూరి బెనారస్‌బాబు గురూజి పర్యటన

కల్లూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త



శ్రీ జగదాంబ శక్తి పీఠాధిపతులు బ్రహ్మశ్రీ తాళ్ళూరి బెనారస్‌బాబు గురూజి ఈ నెల 23వ తేదీ నుండి 26వ తేదీ వరకు కల్లూరు మండలంలో పర్యటిస్తారని విశ్వ హిందూ పరిషత్ కల్లూరు మండల శాఖ బొడ్డు కృష్ణయ్య, గురూజి కార్యనిర్వహణాధికారి రాణి ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ ఉదయం 7 గంటలకు పుల్లయ్య బంజర, సాయంత్రం 6 గంటలకు లోకవరం, 24వ తేది ఉదయం 7 గంటలకు బత్తులపల్లి, సాయంత్రం 6 గంటలకు కప్పలబంధం, 25వ తేది ఉదయం 9 గంటలకు ఓబులరావు బంజర, సాయంత్రం 6 గంటలకు వైఎన్ పురం, 26వ తేది ఉదయం 9 గంటలకు విశ్వనాథపురం, సాయంత్రం 6 గంటలకు ముచ్చవరం గ్రామాల్లో ప్రతి గడప గడపకు పర్యటిస్తారని వారు తెలిపారు. కావున ఈ కార్యక్రమాలలో విహెచ్‌పి సభ్యులు, హిందు బంధువులు అందరూ పాల్గొనాలని వారు కోరారు.

## ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మోదుగు



తల్లాడ, అక్టోబర్ 22, ప్రభాతవార్త

తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం ఎన్నుకున్న రాష్ట్ర కమిటీలో తల్లాడ మండలం, పాత పినపాక గ్రామానికి చెందిన తొలి ఉద్యమకారుడు మోదుగు ఆశీర్వాదం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. మంగళవారం ఉద్యమకారుల ఫోరం స్టేట్ చైర్మన్ చీమ శ్రీనివాస్‌చే నియమాక పత్రాలు అందుకున్నట్లు మోదుగు ఆశీర్వాదం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కమిటి ద్వారా పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. మోదుగు ఆశీర్వాదానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటి సభ్యుడిగా ఎన్నిక కావడం, ఉద్యమకారుడిగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లభించినందుకు పలు పార్టీల నాయకులు, ప్రజలు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## ముత్యాలమ్మ గుడిలో చోరీ

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 22 :

మణుగూరు మండలం సమితిసింగారం గ్రామంలోని ముత్యాలమ్మ గుడిలో మంగళవారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి ఆభరణాలు, వెండి కళ్లు, గుడి పూజా సామాగ్రిని దొంగలించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదుచేయనున్నట్లు కమిటీసభ్యులు తెలిపారు.




సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూర్

## అకాల వర్షంతో నేలవాలిన పంటలు - ఆందోళనలో రైతన్నలు..



కల్లూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త

కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో కురిసిన అకాల వర్షంకు వరి పంట నేల వాలింది. గత రెండు రోజులుగా కురుస్తున్న గాలి ధుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షంకు మెట్ట,



మాగాణి పంటల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లూరు మండల పరిధిలోని లింగాల, పుల్లయ్య బంజర, కిష్టయ్య బంజర, ఎర్రబోయినపల్లి, చంద్రుపట్ల, రఘునాథగూడెం, ముచ్చారం, కల్లూరు, పేరువంచ, బత్తులపల్లి, లక్ష్మీపురం తదితర గ్రామాలలో సన్నాల సాగు పంట చతికిలపడిపోయింది. సన్నాల వరి పంటల నేలవాలి పోవడంతో దిగుబడి తగ్గుతున్నందున రైతులు దిగాలున ఉన్నారు. అదే విధంగా పత్తి పంటకు కూడా నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, వరి పంటలకు సంబంధించిన రైతులు చేతికందే దశలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షం దెబ్బతీయడంతో రైతులు దిగులుపడ్డారు. సుంకు పోసుకుంటున్న తరుణంలో గాలి దుమారంతో అకాల వర్షానికి వరి నేలపాలవ్వడంతో కల్లూరు మండల పరిధిలోని రఘునాథగూడెం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను పరిశీలించడానికి అధికారులు కానరావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అలాగే అకాల వర్షానికి మండల పరిధిలోని తూర్పులోకారం, పడమర లోకారం గ్రామాలలో కూడా వరి పంట నేలవాలింది.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు చివరి తేది 30

కల్లూరు, అక్టోబర్ 22, ప్రభాతవార్త

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ అపరాధ రుసుముతో గడువు ఉందని కో-ఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్ కోరారు. చదువు మధ్యలో మానేసిన వారు రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్ళి చదువుకోలేని వారు, అదే విధంగా ఇంటర్ ఒకే సంవత్సరంలో పూర్తి చేయాలనుకునేవారు ఈ సదవకాశాన్ని మండలంలోని ఆశక్తి గల వారందరూ ఉపయోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 99858 35115 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## తల్లాడ ట్రాన్స్‌కో ఏఈగా రాయల

తల్లాడ, అక్టోబర్ 22, ప్రభాతవార్త



తల్లాడ విద్యుత్‌శాఖ ట్రాన్స్‌కో ఏఈగా రాయల ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మొన్నటివరకు ఎఈగా పనిచేసిన రాజేష్ ప్రొటెక్షన్ ఏఈగా బదిలీ కాగా, రాయల ప్రసాద్ కన్‌సక్షన్ డిపార్ట్‌మెంట్ ఏఈగా పనిచేసి బదిలీపై తల్లాడ ఏఈగా బాధ్యతలు స్వీకరించారు. మొన్నటివరకు పనిచేసిన రాజేష్ విధుల్లో ముక్కుసూటిగానే వ్యవహరించారు. రాజకీయంగా చైతన్యవంతమైన తల్లాడ మండలంలో ట్రాన్స్‌కో ఏఈగా పనిచేయడం అంత సునాయాసం కాదనే చెప్పవచ్చు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

# వాతావరణ పరిస్థితులే ఎండాకుతెగులుకు కారణం

### వరి పొలాల క్షేత్రపర్యటనలో ఏవో వాణి

**కూసుమంచి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త) :**



వరిపైరులో ఆశిస్తున్న బ్యాక్టీరియా ఎండాకుతెగులుకు వాతావరణ మార్పులే కారణమని కూసుమంచి మండల ఏవో వాణి అన్నారు. మంగళవారం ఎర్రగడ్డతండా, కొత్తూరు, నరసింహులగూడెం గ్రామాలలో రైతులతో కలిసి ఆమె వరి పొలాలను పరిశీలించారు. వాతావరణంలో వచ్చే ఉబ్బ, ఎండ ప్రభావంతోనే ఎండాకు తెగులు ఆశిస్తుందని అన్నారు. ఎండాకు తెగులుకు నివారణ మందులు ఏమీ లేవన్నారు. రైతులు ఎండాకు తెగులు గమనించిన వెంటనే నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. ఎండాకు తెగులు తొలిదశలో గమనించినట్లయితే కొంతవరకు వ్యాప్తిని అరికట్టేందుకు ప్లాంటమైసిన్ లేదా పోషమైసిన్ 0.2గ్రాములు లేదా అగ్రిమైసిన్ 0.4గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరి పూతదశలో ఉంటే కాపర్ శిలీంద్రనాశిని పిచికారి చేయరాదని సూచించారు. ఈ తెగులును సమగ్ర యాజమాన్య చర్యలలో భాగంగా ఆఖరి దఫాగా పొటాష్ ఎరువును ఎకరానికి 15 నుంచి 20 కిలోలు వర్షాలు తగ్గిన తరువాత వేసుకోవాలని తెలిపారు. పొలంలో పాతనీరు తీసివేసి కొత్తనీరు పెట్టడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోతో పాటు పాలేరు క్లస్టర్ ఏఈవో మానస, రైతులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం

**వైరా, అక్టోబర్22,(ప్రభాతవార్త):**



పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని వైరా మండల కేంద్రంలో వైరా లయన్స్‌క్లబ్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పోలీస్ అమీరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ వదనద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులను గుర్తు చేసుకుంటూ కొవ్వొత్తులు వెలిగించి వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజునాగేశ్వరరావు, ఎస్సై భాగ్యరాజ్ మాట్లాడుతూ ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీస్ మేల్కొని శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం నిరంతరం కాపలా కాస్తుంటా రని ఎండ వాన పగలు రాత్రి లేకుండా కుటుంబంతో కలిపి జరుపుకునే పండుగలు కూడా వదులుకొని ప్రజల కోసం శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు సైతం పణంగా పెట్టి సంఘ విద్రోహ శక్తులపై పోరాడి వీరమ రణం పొందిన పోలీసులు చేసిన త్యాగానికి సానుభూతి గౌరవించడం చూపించడం మనందరి బాధ్యత అని అన్నారు. పోరాడి చనిపోయిన పోలీసులు అమరవీరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిసూనత వారి ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఏదునూ తల బుచ్చిరామారావు, లయన్స్‌క్లబ్ సెక్రటరీ అబ్బూరి రమేష్, కోశాధికారి మరికంటి రాంగోపాల్, షేక్ లాల్‌మహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు తక్షణమే రైతుభరోసా ఇవ్వాలి..

**కూసుమంచి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త) :**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని సీపీఎం రైతుసంఘం నాయకులు విమర్శించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి నేడు మోసంచేసేలా ప్రకటనలు చేయడం విడ్డూరమని అన్నారు. ఇప్పటికే రెండు పంటల కాలానికి వ్యవసాయ పెట్టుబడికోసం రైతు భరోసా ఇవ్వలేదని, ఇవ్వటం కుదరదని వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించడం రైతులను మోసం చేసినట్లేనని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అర్హులకు నష్టపరిహారం, రైతు భరోసా, రుణమాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి, తోటకూర రాజు, తెలంగాణ రైతుసంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్, గన్యానాయక్, బాస్ నాయక్, వీరారెడ్డి, కర్ణబాబు, వెంకన్న, వెంకటేశ్వరరావు, వీరాస్వామి, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

## ఇబ్బందికరంగా మారిన చెట్ల కొమ్మలు తొలగింపు



**నేలకొండపల్లి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):**

నాచేపల్లి-మంగాపురంతండా రహదారిలో వాహనాల పై ప్రయాణించే వాహనదారులకు రోడ్డుకు ఇరుప్రక్కల ఉన్న చెట్ల కొమ్మలు తీవ్ర ఇబ్బంది కల్గిస్తూ ప్రమాదకరంగా మారాయి. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు మంగళ వారం ఆరోడ్డుకు ఇరుప్రక్కల ఉన్న చెట్ల కొమ్మలను జేసిబి సహాయంతో తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఏఎంసి ఛైర్మన్ సీతారాములుకు పలువురు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## మిరప రైతులు అప్రమత్తంగా ఉండాలి

**కూసుమంచి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త) :**

మిర్చి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన అధికారిణి అపర్ణ సూచించారు. మంగళవారం కూసుమంచి మండలం రావిచెట్టు



తండాపరిసరాలలో మిర్చితోటలలో వేరుకుళ్ల, కొమ్మకుళ్ల తెగులు సోకిన మిరప తోటలను ఆమె రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుకుళ్ల నిరవారణకు సీఓసీ లేదా ఏదైనా కాపర్ సంబంధిత శిలీంద్రనాశిని లేదా, ట్రైకోడెర్మా విరిడే 3 కేజీలు, సూడోమోనాస్ 3కేజీలు, బెల్లం 5కేజీలు 2వందల లీటర్ల నీటిలో కలుపుకుని మొక్కల పాదులలో పోసుకోవాలని సూచించారు. ఈ సందర్శన కార్యక్రమంలో ఏవో వాణి, రైతులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

**వైరా, అక్టోబర్22,(ప్రభాతవార్త):**

వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చేతుల మీదుగా 33 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్



చెక్కులు రూ.3303828లు, 34 సిఎం రిలీఫ్ ఫండ్ రూ.14లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటుందని సమగ్ర భృతికి కృషి చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అందరూ చేయూతనివ్వాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న ఆర్థిక సహాయం ఆదపడచులకు ఎంతో ఉపయోగపడుతుందని అదేవిధంగా నిరుపేద ప్రజలు వైద్య ఖర్చు నిమిత్తం హాస్పిటల్ వైదనయం చేయించుకొని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి సిఎం సహాయ నిధి ఎంతో తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, మాజీ మార్క్‌ఫెడ్ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, రాంపూడి రోశయ్య, పాలేటి నర్సింహారావు, బొళ్ళ గంగారావు, సూర్యదేవర శ్రీధర్, ఇటుకల మురళి, నరవనేని అశోక్, మట్టూరి కృష్ణారావు, మంచాల జయరాజు, షేక్ సైదా, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వేముల పుల్లారావు, వేల్పుల రామారావు, బండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం

## సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోండి



**నేలకొండపల్లి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):**

సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి సిఇవో వసంతరావు వెల్లడించారు. సహకార సంఘాల ద్వారా రుణాలు పొందిన రైతులు తిరిగి చెల్లించి సహకార వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన చెప్పారు. మంగళవారం పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు దాదాపు రూ.30లక్షలు రుణాలను రైతులకు ఆయన పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డిసిసిబి సిఇవో వసంతరావును పైనంపల్లి పిఏసిఎస్ ఛైర్మన్ డాక్టర్ నాగబండి శ్రీనివాసరావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి నేలకొండపల్లి బ్రాంచ్ మేనేజర్ ఇందు, సూపర్‌వైజర్ నాగప్రసాదు, సంఘం ఉపాధ్యక్షుడు కలకుంట్ల శ్రీను, డైరక్టర్లు విజయభాస్కర్, భాస్కరరెడ్డి, వెంకట్రామయ్య, బాలాజీ, శ్రీను, నాగేశ్వరరావు, సామేలు, సంఘం సిఇవో జగదీష్, మాజీ సిఇవో వీరస్వామి, రాంబాబు, ప్రవీణ్, అనసూయ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పూణే ప్రీరిపబ్లిక్‌డే పేరెడ్‌కు నేలకొండపల్లి విద్యార్థి ఎంపిక



**నేలకొండపల్లి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):**

జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పూణే నగరంలో జరుగనున్న ప్రీరిపబ్లిక్‌డే పేరెడ్‌కు నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బికాం తృతీయ సంవత్సర విద్యార్థి కోనేటి నాగరాజు ఎంపికైనట్లు ఆకళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఆలేటి వరంజ్యోతి మంగళవారం విలేకరులకు తెలిపారు. నవంబర్ 12 వతేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే ఈ పేరెడ్‌కు తమ కళాశాలకు చెందిన విద్యార్థి కోనేటి నాగరాజు ఎంపిక కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. అలాగే, విద్యార్థి కోనేటి నాగరాజును కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్ నారాయణస్వామి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## స్కాలర్‌షిప్ రూ.20వేలకు పెంచాలి..

**కూసుమంచి, అక్టోబర్ 22 (ప్రభాతవార్త) :**

పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూ.20వేలకు పెంచాలని పాలేరు డివిజన్ బీసీ సంఘం అధ్యక్షుడు పోశం నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వేలాదికోట్లు వృథాగా ఖర్చుపెడుతుందని, విద్యార్థులకు మాత్రం ఫీజుల బకాయిలు చెల్లించేందుకు తీవ్ర జాప్యం చేస్తోందని దుయ్యబట్టారు. గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో బీసీ సంఘం నేత ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితంగా విడుదలయిన నిధులు తప్ప, నేటి వరకు ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయలేదని అన్నారు. లేని పక్షంలో బీసీ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నానిర్వహిస్తామని హెచ్చరించారు.

# ప్రైవేట్ విద్యాలయాలపై పర్యవేక్షణ కరువు

## పాఠశాల బస్సుల్లో క్లీనర్ లేక విద్యార్థుల అవస్థలు
## టాటా మ్యాక్స్‌లకు కనిపించని స్కూల్ అడ్రస్‌లు

*దమ్మపేట రూరల్ ,అక్టోబర్ 22 ప్రభాతవార్త :*

మండలంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కొందరు ఆడిందే ఆట పాడిందే పాటగా విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు కొందరు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు తమ తమ ఇండ్లకు చేరుకోవడానికి ఏర్పాటు చేసిన వాహనాలకు సరైన క్లీనర్ లేక బస్సులు దిగే సమయంలో అవస్థలు పడుతున్నారని ఆవేధన చెందారు. బస్సు దిగే సమయంలో గానీ లేదా రోడ్డు దాటే సమయంలో గానీ బస్సుకు క్లీనర్ లేకపోతే విద్యార్థులు రోడ్డుదాటడం ఎలా అని తల్లిదండ్రులు అవేధన చెందుతున్నారు. అంతేగాక పాఠశాల యాజమాన్యం కూడా విద్యార్థుల పట్ల కొందరు దురుసుగా వ్యహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేధన చెందారు. విద్యార్థులకు సరిపడు మూత్రశాలలు లేక బహిర్భూమి వైపు చూస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నాగానీ మండలంలో ఉన్న విద్యాశాఖాధికారులు కన్నెత్తికూడా చూడటం లేదని తల్లిదండ్రులు కొందరు ఆరోపిస్తున్నారు. ఫిట్ నెస్ సక్రమంగా లేని బస్సులు కూడా కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఉపయోగిస్తున్నాయని, జిల్లా స్థాయి ట్రాన్స్ పోర్టు అధికారులను యాజమాన్యాలు మేనేజ్ చేస్తూ విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తున్నారన్నారు. మరికొన్ని పాఠశాలల్లో ప్రైవేట్ వాహనాలను నడుపుతున్నారని, టాటామ్యాక్స్ లలో విద్యార్థులను తరలిస్తున్నారని ఆవేధన చెందారు. ఏదేని ప్రమాదం వాటిల్లితే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అంతేగాక బస్సులలో పరిమితికి మించి, అంటే సీటింగ్ కంటే ఎక్కువమంది విద్యార్థులను బస్సులలో ఇంటికి చేరవేస్తున్నారని, అలా చేసే క్రమంలో పేద విద్యార్థులకు ఏమైనా బస్సు ఫీజులో రాయితీలు కల్పిస్తున్నారా...? అంటే అదికూడా లేదన్నారు. ఇన్ని అసౌకర్యాలతో ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తుంటే ఏరోజు కూడా విద్యాశాఖాధికారులు కనీసం చర్యలు తీసుకున్న వార్తలు లేకపోవడంపై పలువిమర్శలు వినిపిస్తున్నాయి. దీనితో పాటుగా పదవతరగతిలో పాఠశాల కు మంచిపేరు సంపాదించాలనే నెపంతో పదవతరగతి విద్యార్థులపైనే మోయలేని భారం మోపుతూ , హోమ్ వర్క్ పేరుతో విద్యార్థులను మానసికంగా ఇబ్బంధులకు గురిచేస్తున్నారని కొందరు విద్యార్థులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. పదవతరగతి విద్యార్థుల ర్యాంకుల బట్టే ఆ పాఠశాల ప్రతిభ వచ్చే విద్యాసంవత్సరం లో జాయిన్ విద్యార్థుల సంఖ్య ఆధారపడి ఉంటుందనేది పాఠశాల యాజమాన్యాల ఆలోచనగా ఉందని తల్లిదండ్రులు ఆవేధన చెందుతున్నారు. చిన్న తరగతులకు కొద్దిపాటి నాలెడ్జ్ ఉన్న ఉపాధ్యాయులను కేటాయించి , ప్రావీణ్యం ఉన్న ఉపాధ్యాయులు ఎవరైనా ఉంటే వారిని మొత్తం పదవతరగతి విద్యార్థులకే కేటాయిస్తున్నారని, చిన్న తరగతులనుండి సబ్జెక్టులపై పూర్తిస్థాయిలో నాలెడ్జ్ పెంపొందించడంలో కనీస శ్రద్ధ తీసుకోవడంలేదని తల్లిదండ్రులు కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం మూడు నెలలకు ఒకసారైనా మండల విధ్యాశాఖాధికారులు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాలయాలపై పర్యవేక్షణ చేస్తుంటేనే పాఠశాలల యాజమన్యాలకు వారి భాధ్యత లు గుర్తుంటాయని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారిని వివరణ అడిగేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

# స్వచ్ఛభారత్ ఆటో డ్రైవర్లు, హెల్పర్లకు మున్సిపాలిటీ ద్వారా జీతాలు ఇవ్వాలి

## - బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

*పాల్వంచ టౌన్, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*

పాల్వంచ మున్సిపాలిటీలో నిధులు నిర్వర్తిస్తున్న స్వచ్ఛ భారత్ డ్రైవర్లు, హెల్పర్లకు మున్సిపాలిటీ ద్వారా జీతాలు ఇవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా



కామేష్ మాట్లాడుతూ... మున్సిపాలిటీలో స్వచ్ఛ భారత్ డ్రైవర్లు, హెల్పర్లుగా నాలుగున్నర సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తూ జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఏ నాయకుడైనా ఎన్నికల ముందు గెలిపిస్తే జీతాలు ఇప్పిస్తామని హామీ ఇవ్వడం గెలిచాక ముఖం చాటేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనులు చేయడం మూలంగా మున్సిపాలిటీకి అవార్డులు వచ్చిన సంగతి మరువద్దని అన్నారు. గతంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ విధులు నిర్వహించిన సమయంలో కార్మికులకు ఇచ్చిన గుర్తింపు కార్డులను అతను బదిలీపై వెళ్లగానే అట్టి గుర్తింపు కార్డులను సైతం ప్రస్తుత మున్సిపల్ అధికారులు తీసుకొని కార్మికులకు ఇవ్వకుండా వారి వద్ద పెట్టుకున్నారని, ఇది సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, గద్దెల రమేష్, ఎస్‌కే బాషా, కాపు సంఘం నుంచి చిన్నంశెటనఇట రంగారావులు సంఘీభావం తెలిపారు. కాకటి హుస్సేన్, దద్దాల కార్తీక్, రాయల పార్వతి, వేముల రమణ, గుగులోత్ సరోజ, కాంపెల్లి రాము పాల్గొన్నారు.

# కాలినడకన ఉద్యమాన్ని నిర్మించాం

## - ఉమ్మడి రాష్ట్ర తొలి మహాసభను విజయవంతం చేశాం
## - ఐద్వా ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదటి కార్యదర్శి ఏలూరి జయమ్మ
## - ఉత్తేజంగా ప్రారంభమైన ఐద్వా రాష్ట్ర మహాసభలు

*కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 22 - ప్రభాతవార్త:*

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర నాలుగుఓ మహాసభలు మల్లు స్వరాజ్యం నగర్, కొండపల్లి దుర్గాదేవి ప్రాంగణంలో కొత్తగూడెం క్లబ్‌లో ఉత్తేజభరితంగా ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభం సూచికంగా ఐద్వా పతాకాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, సీనియర్ నాయురాలుబత్తుల హైమావతి ఆవిష్కరించారు., జెండా ఆవిష్కరణ సందర్భంగా స్వేచ్ఛ, సమానత్వం, స్త్రీ విముక్తి వర్ధిల్లాలని ప్రతినిధులు నినాదాలు చేయడంతో సభా ప్రాంగణం అంతా ప్రతిధ్వనించింది. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద అఖిలభారత నాయకులు, రాష్ట్ర నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా అఖిలభారత ప్రధాన కార్యదర్శి మరియం దావలే, కొండపల్లి దుర్గాదేవి చిత్రపటానికి జాతీయ అధ్యక్షురాలు పుణ్యవతి, కుంజా కృష్ణకుమారి చిత్రపటానికి సుధా సుందర్ రామన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**- కాలినడకన ఉద్యమాన్ని ప్రారంభించాం : ఏలూరి జయమ్మ**

1947 సంవత్సరంలో కాలినడకన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక గ్రామాల్లో పర్యటించి మోటూరు ఉదయం, మల్లు స్వరాజ్యం సహకారంతో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వాకి అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం ఉమ్మడి రాష్ట్ర మొట్టమొదటి మహాసభను ఖమ్మంలో వర్తక సంఘం భవనంలో నిర్వహించామని, నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా ఉద్యమానికి మొట్టమొదటి జిల్లా కార్యదర్శిగా పనిచేసిన ఏలూరి జయమ్మ తెలిపారు. కొత్తగూడెంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా 95 సంవత్సరాల వయస్సులో ఏలూరి జయమ్మ మహాసభకు హాజరై ప్రతినిధులను ఉత్సాహపరిచే సందేశాన్ని ఇచ్చారు. మహిళలు ఇంటి నుంచి బయటకు రావడానికి అనేక ఆటంకాలు ఉన్న కాలంలో మహిళలను సమీకరించి ఉద్యమాలు చాలా కష్టంతో కూడుకున్న సమయంలో అనేక గ్రామాల్లో కాలినడకన వెళ్లి ఉద్యమాల నిర్మించాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. రోజుల తరబడి కుటుంబాన్ని, పిల్లలను వదిలిపెట్టి ఉద్యమ నిర్మాణం కోసం, పోరాటాల కోసం కొండపల్లి దుర్గాదేవి కృషి చేశామని ఏలూరు జయమ్మ తెలిపారు.

**- రాజకీయ తరగతుల స్ఫూర్తితో ఐద్వా నిర్మాణంలోకి వచ్చాను :** కొమరం స్వరాజేశ్వరమ్మ రాజకీయ తరగతుల స్ఫూర్తితో ఐద్వా నిర్మాణంలోకి వచ్చానని, నాటి అనుభవాలను సీనియర్ నేత కొమరం స్వరాజేశ్వరమ్మ అన్నారు. 1947లో విజయవాడలో జరిగిన మహిళా కార్యకర్తల రాజకీయ శిక్షణా తరగతులకు హాజరై అక్కడ మోటూరు ఉదయం, మానకొండ సూర్యావతి, బిక్షావతి తదితరులు బోదించిన విషయాలను స్ఫూర్తిగా తీసుకొని తాను ఐద్వా నిర్మాణంలోకి వచ్చానని ఉమ్మడం ఖమ్మం జిల్లా ఐద్వా నిర్మాతల్లో ఒకరైన కొమరం స్వరాజేశ్వరమ్మ అన్నారు. భూస్వామ్య వ్యవస్థ పాలకులు మహిళలను ఎలా దోపిడి చేస్తారో శ్రమను ఎలా దోచుకుంటారో ఆనాడు వివరించారని, ఆ శిక్షణా తరగతుల స్ఫూర్తి ఉద్యమంలోకి రావడానికి కీలకంగా పనిచేసిందని గుర్తు చేశారు. నాటి నుంచి భద్రాచలం గిరిజన ప్రాంతంలో మహిళల హక్కుల కోసం భూమి కూలి తదితర సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశానని, 95 సంవత్సరాల వయస్సు నిండిన సీనియర్ ఐద్వా నాయకురాలు కొమరం స్వరాజేశ్వరమ్మ తన అనుభవాలను ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభల ప్రతినిధులకు వివరించారు.









# ఉచిత శిక్షణ తరగతుల కొరకు ధరఖాస్తుల ఆహ్వానం

## -ఐటిడిఏ పీవో బీ.రాహుల్

*భద్రాచలం, ప్రభాతవార్త :*

గిరిజన సంక్షేమ శాఖ తెలంగాణ ప్రభుత్వం బ్యాకింగ్/ఐబీపీఎస్ (పీవో,ఎస్/కీఆర్స్) పరీక్షల కోసం తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత కోచింగ్ అందించడానికి యోచిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బీ.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులు అర్హులైన, కోచింగ్ తీసుకోవడానికి ఇష్టపడే అభ్యర్థులు ఆన్‌లైన్ (స్టడీ సర్కిల్.సీజీజీ.జీవోవి.ఇన్) ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచిస్తూ ఈ నెల 27వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, అభ్యర్థులను మెరిట్ రిజర్వేషన్ పద్ధతిన ఎంపిక చేయబడునని, ధరఖాసుతన చేసుకున్న తెలంగాణ అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.0లక్షలు మించకూడదని, ఎంపికైన అభ్యర్థులకు నెలవారి స్కాలర్‌షిప్, స్టడీ మెటీరియల్ అండ్ లాంగ్ నోట్‌బుక్స్ అందించబడతాయని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 040-27540104 ఫోన్ నెంబర్‌కు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని ఆయన సూచించారు.

